


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 317, పేజీలు - 08

గురువారం, మే 7, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




### తారాస్థాయికి చేరిన

## భాషా యుద్ధం

### - కేటీఆర్ వ్యాఖ్యలపై భగ్గుమన్న కాంగ్రెస్




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించింది. వరంగల్‌లో రైతు సంగ్రామ సభ ఏర్పాటు చేసింది. ఈ సభలో ప్రభుత్వంపై

2లో..

### నా కాన్వాయ్ కోసం

## ట్రాఫిక్ ఆపొద్దు

### - డీజీపీకి సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

2లో..



### పరేడ్ గ్రౌండ్స్ వేదికగా

# మోదీ సమరశంఖం

### - రాజకీయం మారిపోతుందా.?



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) పశ్చిమ బెంగాల్ కోటను బద్దలు కొట్టిన బీజేపీ అధిష్టానం, ఇప్పుడు తన విజయ యాత్రను దక్షిణ భారతం వైపు మళ్లించింది. 15 ఏళ్ల కిందట బెంగాల్‌లో నామమాత్రంగా ఉన్న శక్తి, నేడు 207 సీట్లతో అధికారాన్ని కైవసం చేసుకోవడం వెనుక ఉన్న సైలెంట్ ఆపరేషన్ వ్యూహాలను ఇప్పుడు తెలంగాణలో అమలు చేసేందుకు కమలనాథులు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా మే 10న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న సభ ద్వారా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు శంఖారావం పూరించబోతున్నారు.

#### జీరో నుంచి హీరోగా.. బెంగాల్ మోడల్ తెలంగాణలో!

బెంగాల్‌లో మమతా బెనర్జీ వంటి ఉద్దండురాలిని ఓడించడం ద్వారా బీజేపీ శ్రేణుల్లో రెట్టింపు ఉత్సాహం నెలకొంది. అదే తరహాలో తెలంగాణలో ఇప్పటికే ఉన్న ఎనిమిది మంది ఎంపీల బలంతో, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని మోదీ-షా ద్వయం భావిస్తోంది. బెంగాల్ గెలవగలిగితే తెలంగాణ ఎందుకు సాధ్యం కాదు అనే నినాదంతో బీజేపీ ముందుకు వెళుతోంది. ఈ సభ ద్వారా సుమారు 8,000 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తూనే, రాజకీయ మార్పుకు మోదీ పిలుపునివ్వనున్నారు.

#### పరేడ్ గ్రౌండ్స్ సాక్షిగా.. విజయ్ సంకేతం!

వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో గెలవబోయేది తామేనని మోదీ ఈ సభ ద్వారా అధికారికంగా ప్రకటించబోతున్నారు. ముఖ్యంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ప్రత్యామ్నాయం కేవలం బీజేపీయేనని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడమే ఈ సభ ప్రధాన ఉద్దేశ్యం. ఇప్పటికే రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు, కేంద్ర మంత్రి బండి సంజయ్ వంటి నేతలు టీమ్ మోదీ పర్యటనను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. వికసిత్ తెలంగాణ నినాదంతో తో ఇప్పటికే ప్రజల్లోకి వెళ్లిన పార్టీ, ఇప్పుడు మోదీ సభతో పీక్ స్టేజ్‌కు చేరుకోవాలని చూస్తోంది.

#### అండర్ కరెంట్ వ్యూహాలు.. సైలెంట్ ఆపరేషన్

బెంగాల్‌లో ఎలాగైతే కిందిస్థాయి ఓటర్లను మచ్చిక చేసుకున్నారో, తెలంగాణలోనూ అదే తరహా సైలెంట్ ఆపరేషన్ ప్రారంభమైంది. ఇతర పార్టీల అసంతృప్త నేతలను చేర్చుకోవడం, కుల సమీకరణలను సరిదిద్దడం, కేంద్ర ప్రభుత్వ పథకాలైన ఆయుష్మాన్ భారత్, పీఎం కిసాన్ వంటి వాటిని ఇంటింటికీ తీసుకెళ్లడం ద్వారా ఓటు బ్యాంకును పటిష్టం చేయాలని భావిస్తున్నారు. ముఖ్యంగా యువత, మహిళా ఓటర్లను టార్గెట్ చేస్తూ బీజేపీ సోషల్ మీడియా సైన్యం రంగంలోకి దిగింది. బీజేపీ అంచనా ప్రకారం, దక్షిణ భారతదేశంలో కర్ణాటక తర్వాత పార్టీకి అత్యంత అనుకూలమైన రాష్ట్రం తెలంగాణ. ఇక్కడ ఇప్పటికే బలమైన ఓటు శాతం ఉండటం, నాయకత్వం చురుగ్గా ఉండటం వల్ల కొంచెం కష్టపడితే అధికారం సాధ్యమని అమిత్ షా బృందం లెక్కలు వేస్తోంది. బెంగాల్ విజయం అందించిన ఊపుతో, తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కారు ఆవశ్యకతను మోదీ తన ప్రసంగంలో నొక్కి చెప్పనున్నారు.

#### తెలంగాణ రాజకీయాల్లో కొత్త మలుపు!

మోదీ మే 10 పర్యటన కేవలం అభివృద్ధి పనుల ప్రారంభానికే పరిమితం కాదు. ఇది తెలంగాణ రాజకీయ భవిష్యత్తును నిర్ణయించే ఒక భారీ బహిరంగ సభ. బెంగాల్ ఓటమితో ప్రతిపక్ష ఇండియా కూటమి నైతిక దెబ్బ తిన్న తరుణంలో, ఆ గ్యాప్‌ను క్యాష్ చేసుకోవాలని బీజేపీ చూస్తోంది. పరేడ్ గ్రౌండ్స్ గర్జన తర్వాత తెలంగాణ రాజకీయాలు మరోసారి త్రిముఖ పోరు నుంచి బిజెపి వర్సెస్ అదర్స్ గా మారే అవకాశం కనిపిస్తోంది.

### టీవీకే అధినేత విజయ్‌కు

# బిగ్ షాక్

### - ప్రభుత్వ ఏర్పాటుకు లభించని గవర్నర్ అనుమతి



చెన్నై (ప్రశ్న న్యూస్) తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం ప్రభుత్వ ఏర్పాటుపై నెలకొన్న పరిణామాలు ఉత్కంఠ రేపుతున్నాయి. విజయ్ నేతృత్వంలోని టీవీ అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ, అధికార పీఠాన్ని అందుకోవడానికి అవసరమైన స్పష్టమైన మ్యాజిక్ ఫిగర్‌ను నిరూపించుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటోంది.

#### గవర్నర్ ఆచితూచి అడుగు - సంఖ్యాబలమే ప్రాధాన్యం

టీవీకే అధ్యక్షుడు విజయ్ రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలని కోరారు. అయితే, ప్రస్తుతానికి కేవలం 112 మంది ఎమ్మెల్యేల మద్దతు మాత్రమే కాంగ్రెస్‌తో కలిపి ఉన్నందున, 118 మంది మ్యాజిక్ మార్కును చేరుకున్నాకే ప్రమాణ స్వీకారానికి రావాలని గవర్నర్ సూచించినట్లు సమాచారం. అతిపెద్ద పార్టీగా విజయ్‌ను ఆహ్వానించే వెసులుబాటు ఉన్నప్పటికీ, సంక్షోభం తలెత్తకుండా ఉండేందుకు ముందుగానే మెజారిటీకి అవసరమైన సంతకాలతో కూడిన జాబితాను గవర్నర్ కోరుతున్నారు.

#### విజయ్.. కాంగ్రెస్ మాత్రమే తోడు


కూటమి రాజకీయాల్లో విజయ్ ఆశించిన స్థాయిలో మద్దతు లభించడం లేదు. డీఎంకే కూటమి నుంచి బయటకు వస్తాయనుకున్న

2లో..

### సీవీడ్ ఆదాయంపై

# ఎకనమిక్ మోడల్ సిద్ధం చేయండి

### - సీవీడ్ ఫార్మింగ్‌పై సీఎం చంద్రబాబు సమీక్ష




**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఈ ఏడాది మే 15 నుంచే రైతులకు సాగునీరు అందించనున్న దృష్ట్యా రాష్ట్రంలో వేగంగా విత్తన సరఫరా చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యవసాయ శాఖకు దిశానిర్దేశం చేశారు. విత్తనాల సరఫరా కోసం రూ.200 కోట్లు కేటాయించాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. సచివాలయంలో బుధవారం ఆయన రాష్ట్రంలో ధాన్యం, అరటి, పొగాకు, ఆయిల్ పామ్ తదితర పంటల కొనుగోళ్లపై సీఎం వ్యవసాయ, ఉద్యాన శాఖలతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు మంత్రి కె.అచ్చెన్నాయుడు, వ్యవసాయ, ఉద్యాన శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. మార్కెట్ డిమాండ్ కు అనుగుణంగా రైతులు పండించే పంటలకు ధరలు దక్కేలా చూడాలని సీఎం స్పష్టం చేశారు. ట్రేసబిలిటీ, సర్టిఫికేషన్ ద్వారా పంటలకు మెరుగైన ధర లభించే అవకాశం ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

#### మామిడిని ప్రాసెసింగ్ యూనిట్లు కొనుగోలు చేసేలా చూడాలి

రైతుకు లాభసాటిగా ఉండేలా నాణ్యమైన పంట దిగుబడులు వచ్చేందుకు కృషి చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు. మరిన్ని పంటలను ప్రకృతి సేద్యం విధానంలో వివిధ పంటలను సాగు చేస్తే రైతులకు మరింత ప్రయోజనం కలుగుతుందన్నారు. సేంద్రీయ

2లో..

# హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు ఆమోదం తెలపండి

### కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో సీఎం రేవంత్ భేటీ



**న్యూఢిల్లీ / హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు ఆమోదం తెలపాలని కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఏడు కారిడార్లతో కూడిన మెట్రో ఫేజ్-2 సమగ్ర ప్రణాళికను రూపొందించి డీపీఆర్‌ను ఇప్పటికే సమర్పించామని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బుధవారం సాయంత్రం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి హైదరాబాద్ మెట్రో ఫేజ్-2, మెట్రో ఫేజ్-3పై కేంద్ర మంత్రితో చర్చించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరంలో ప్రయాణికుల సౌకర్యార్థం మెట్రోను మరింతగా విస్తరించాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి తెలియజేశారు.

#### మెట్రో ఫేజ్-2కు ఆమోదం తెలపండి

హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2, ఫేజ్-3 విస్తరణ సజావుగా సాగాలనే ఉద్దేశ్యంతోనే మెట్రో ఫేజ్-1ను ఎల్‌డటీ ఎంఆర్హెచ్ఎల్ ను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. ప్రస్తుతం ఫేజ్-1 ప్రభుత్వం పరిధిలో ఉండడంతో ఫేజ్-2, ఫేజ్-3 విస్తరణ సులువవుతుందన్నారు. హైదరాబాద్‌లో మెట్రో రైలు నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు

2లో..

### 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల

## ఆర్థిక వ్యవస్థగా ఏపీ

### - క్యారియర్ ఏసీ పరిశ్రమకు మంత్రి లోకేశ్ శంకుస్థాపన




**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఇప్పటికే భారతదేశపు కూల్ క్యాపిటల్ గా అవతరించిందని మంత్రి లోకేష్ ప్రకటించారు. ప్రస్తుతం దేశంలో ఉత్పత్తి అవుతున్న ఏసీలలో గణనీయమైన భాగం ఏపీ నుంచే వస్తోందని, 2027 నాటికి దేశీయ ఏసీ ఉత్పత్తిలో 60 శాతం, 2028 నాటికి 80 శాతం వాటా ఆంధ్రప్రదేశ్ నుంచే ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. క్యారియర్ వంటి అంతర్జాతీయ దిగ్గజ సంస్థ రూ. 1000 కోట్ల పెట్టుబడితో ఏపీకి రావడం రాష్ట్ర ఎకోసిస్టమ్ పట్ల ఉన్న నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు.

#### - డేటా సెంటర్ పరికరాల తయారీలో ప్రపంచ నాయకత్వం

2లో..

### హైదరాబాద్

## పబ్లిక్ స్కూల్‌లో అవినీతి

### - ఫీజు పెంపు పై కవిత వార్నింగ్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాదు పబ్లిక్ స్కూల్‌లో అడ్డగోలుగా అవినీతి జరుగుతోందని టీఆర్ఎస్ అధినేత్రి కవిత ధ్వజమెత్తారు. హైదరాబాద్ పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాణ్యమైన విద్య - ఫీజుల నియంత్రణ అనే అంశంపై సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీ, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ లో అవినీతి పై ప్రభుత్వం స్పందించాలని కోరారు.

#### హెచ్‌పీఎస్‌లో భారీ అవినీతి

2లో..

# సీపీ సీక్రెట్ ఆపరేషన్

- అర్ధరాత్రి నడి రోడ్డుపై మహిళా పోలీస్ కమిషనర్
- ఆమెను వేధించిన సుమారు 40 మంది యువకులు
- పట్టుబడిన వారిలో ఎక్కువ మంది విద్యార్థులే
- అందరినీ అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చిన పోలీసులు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ నగరంలో అర్ధరాత్రి వేళ ఒంటరి మహిళ కనిపిస్తే చాలు 'వస్తావా.. రేటెంత?' అంటూ కామపిశాచుల నుంచి జుగుప్సాకరమైన ప్రశ్నలు. ఈ పోకిరీల ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. ఈ అరాచకానికి ముగింపు పలకాలని

2లో..

## రైతుల రక్తం తాగిన పార్టీ కాంగ్రెస్

### 'రైతు సంగ్రామ సదస్సు'లో కేటీఆర్ సంచలన కామెంట్స్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** వరంగల్ వేదికగా సాగుతున్న రాజకీయ పోరాటంలో భాగంగా, కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన 'రైతు డిక్లరేషన్'పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. వరంగల్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'రైతు సంగ్రామ సదస్సు'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, వరంగల్ నగరాన్ని కాకతీయుల పౌరుషానికి నిదర్శనమైన గడ్డగా అభివర్ణించారు. చారిత్రాత్మక నేపథ్యం ఉన్న ఈ నగరం నుంచి పోరాటాల విల్లు ఎక్కుపెడితే, రైతన్నలకు ద్రోహం చేసిన వారి గుండెలు భయంతో వణుకుతాయని ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు.

ఈ సదస్సు ప్రధాన ఉద్దేశం కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు చేసిన మోసాలను సాక్ష్యాధారాలతో సహా ఎండగట్టడమేనని కేటీఆర్ స్పష్టం చేశారు. దాదాపు నాలుగేళ్ల క్రితం ఇదే వరంగల్ గడ్డపై కాంగ్రెస్ అగ్రనేతలు భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసి 'రైతు డిక్లరేషన్' పేరిట అనేక వాగ్దానాలు చేశారని ఆయన గుర్తు చేశారు. గత ఆరు దశాబ్దాల పాటు అధికారంలో ఉండి రైతుల రక్తం తాగిన కాంగ్రెస్ పార్టీ, ఎన్నికల సమయంలో మాత్రం 'కొంగజపం' చేస్తూ మాయమాటలతో

2లో..

ప్రజాప్రశ్న



# తారాస్థాయికి చేరిన భాషా యుద్ధం

విరుచుకుపడిన కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీపై వివాదాస్పద పదజాలం వాడటం రాజకీయ వివాదానికి దారి తీసింది. రాహుల్ గాంధీని మోసగాడు అని, కాంగ్రెస్ నాయకులను రైతు రక్తం తాగే దొంగలు అని సంబోధించారు. అంతటితో ఆగకుండా, ఎన్నికల హామీలు అమలు చేయనందుకు వారిని ఉరితీయాలంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 100 రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పి రైతులను కాంగ్రెస్ దగా చేసింది, ఈ దొంగలను నమ్మొద్దు అంటూ కేటీఆర్ చేసిన ప్రసంగం పొలిటికల్ హీట్ పెంచింది.

### పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఘాటు కౌంటర్

కేటీఆర్ వ్యాఖ్యలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో స్పందించారు. కేటీఆర్ తన సంస్కారాన్ని మర్చిపోయి మాట్లాడుతున్నారని విమర్శించారు. అధికారం కోల్పోయిన ఫ్రస్ట్రేషన్‌లో కేటీఆర్ పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారు. కాంగ్రెస్ పార్టీని విమర్శించే ముందు మీ పదేళ్ల పాలనలో రైతులు ఎన్ని కష్టాలు పడ్డారో ఆత్మవిమర్శ చేసుకోవాలి అని హితవు పలికారు. కేటీఆర్ భాషను చూస్తుంటే ఆయనకు ప్రజాస్వామ్యంపై నమ్మకం లేదని అర్థమవుతోందని, బూతులు తిడితే నాయకుడు కాలేరని మహేష్ కుమార్ గౌడ్ ఎద్దేవా చేశారు.

### రాజకీయాల్లో జోకర్ కావద్దు - మంత్రి సీతక్క హెచ్చరిక

మంత్రి సీతక్క సైతం కేటీఆర్ వ్యాఖ్యలపై గట్టిగా కౌంటర్ ఇచ్చారు. కేటీఆర్ చదువుకున్న వారు, కొంత మంచి పేరున్న వారు ఇలాంటి వెకిలి వ్యాఖ్యలు చేసి జోకర్ కావద్దు అని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే రుణమాఫీ, ఉచిత బస్సు ప్రయాణం వంటి హామీలను అమలు చేస్తుంటే, ఓర్వలేక విషం చిమ్ముతున్నారని విమర్శించారు. కేటీఆర్‌కు అధికారం పోయిందని పిచ్చి పట్టింది, అందుకే బూతులు మాట్లాడుతున్నారు. రాహుల్ గాంధీ వంటి నాయకుడిని విమర్శించే స్థాయి కేటీఆర్‌కు లేదు అని సీతక్క స్పష్టం చేశారు.

### రాను రాను దిగాలిపోతున్న భాష

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రభుత్వం చేస్తున్న తప్పులను ఎండగట్టడం రాజ్యాంగబద్ధమైన హక్కు. కానీ, ఆ నిరసనను వ్యక్తులపై బూతులతో చేయడం వల్ల అసలు సమస్య పక్కదారి పడుతోంది. వరంగల్ సభలో రైతుల రుణమాఫీ, బోనస్ వంటి అంశాలపై క్షేత్రస్థాయి ఆధారాలతో కేటీఆర్ మాట్లాడి ఉంటే ప్రభుత్వానికి ఇబ్బంది కలిగేదని కానీ, ఆయన వాడిన భాష వల్ల ఇప్పుడు చర్చంతా కేటీఆర్ సంస్కారం చుట్టూనే తిరుగుతోందని అంటున్నారు. ఫ్రస్ట్రేషన్ తో తిడితే ప్రజల్లో సానుభూతి రాదని, అది కేవలం రాజకీయ రచ్చకు మాత్రమే దారితీస్తుందని అంటున్నారు.

# నా కాన్వాయ్ కోసం ట్రాఫిక్ ఆపొద్దు

**- డీజీపీకి సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) సాధారణంగా ముఖ్యమంత్రి వస్తున్నారంటే చాలు రోడ్లపై ఎక్కడికక్కడ వాహనాలను నిలిపేస్తూ ఉంటారు. దీంతో ఆ మార్గంలో భారీగా ట్రాఫిక్ నిలిచిపోతూ ఉంటుంది. అయితే హైదరాబాద్ వంటి నగరాల్లో రద్దీ సమయాల్లో సీఎం కాన్వాయ్ కోసం ట్రాఫిక్ నిలిపివేయడం వల్ల రోడ్లపై ప్రజలు నరకయాతన పడుతూ ఉంటారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాను పదవి చేపట్టిన తర్వాత తన కాన్వాయ్ కోసం రోడ్లపై వాహనదారులను ఇబ్బంది పెట్టవద్దని అధికారులు, పోలీసులకు సూచించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే తాజాగా సీఎం రేవంత్ సంబంధిత అధికారులపై తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. తన కాన్వాయ్ కోసం రోడ్లపై భారీగా ట్రాఫిక్ జాం కావడంతో ప్రజలు ఇబ్బంది పడతారని పేర్కొన్నారు.తాజాగా బుధవారం రోజున సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లారు. ఈ సందర్భంగా తన నివాసం నుంచి శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. సీఎం కాన్వాయ్ వెళ్తున్న మార్గంలో పోలీసులు ట్రాఫిక్ ఆపేయడంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే దీనిపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కాన్వాయ్ వెళ్లే సమయంలో వాహనదారులను గంటల తరబడి రోడ్లపై ఆపొద్దంటూ తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్‌కు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.సీఎం కాన్వాయ్ కోసం సామాన్య ప్రజలకు ఆటంకం కలిగించవద్దని కాన్వాయ్ వెళ్లే మార్గంలో కాకుండా ఎదురుగా, అవతలి వైపు వెళ్లే వాహనాలను ఆపి ఇబ్బంది పెట్టవద్దని సూచించారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా ఉండే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీని హెచ్చరించారు. సీఎం రేవంత్ రెడ్డి తాజాగా ఇచ్చిన ఆదేశాలతో డీజీపీ సీవీ ఆనంద్ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీస్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.రాష్ట్రంలో ట్రాఫిక్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించే దిశగా త్వరలోనే కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు డీజీపీ సీవీ ఆనంద్ ప్రకటించారు. ఇందుకోసం ప్రత్యేకంగా ట్రాఫిక్ బ్యూరోను ఏర్పాటు చేస్తున్నట్లు డీజీపీ వెల్లడించారు. ఇక నుంచి సీఎం, వీఐపీ కాన్వాయ్‌లు వెళ్లే సమయంలో ట్రాఫిక్‌ను పూర్తిగా నిలిపివేయకూడదని నిర్ణయించారు. ఒకవైపు సీఎం కాన్వాయ్ వెళ్తే మరోవైపు సింగిల్ లైన్‌లో మిగిలిన వాహనాలను అనుమతించేలా ప్రణాళికలు రెడీ చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. రోడ్లపై రద్దీ ఎక్కువగా ఉండే సమయాల్లో ప్రత్యామ్నాయ మార్గాలను ముందుగానే రెడీ చేసుకోవాలని ట్రాఫిక్ సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేయాలని పేర్కొన్నారు.

# టీవీకే అధినేత విజయ్‌కు బిగ్ షాక్

వామపక్షాలు, విడుతలై చిరుతైగల్ కట్చి , ముస్లిం లీగ్ వంటి పార్టీలు తాము డీఎంకేతోనే ఉంటామని ప్రకటించాయి. దీంతో విజయ్‌కు ప్రస్తుతం కాంగ్రెస్‌లోని ఐదుగురు ఎమ్మెల్యేలు తప్ప మరే ఇతర ప్రధాన పార్టీ మద్దతు లభించలేదు. సిద్ధాంతపరంగా భిన్నమైన అన్నాడీఎంకే మద్దతు కూడగట్టడం కూడా విజయ్‌కు అగ్నిపరీక్షగా మారింది.

### వ్యూహ ప్రతివ్యూహాల్లో అన్నాడీఎంకే

ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకేలో నెలకొన్న అంతర్గత పరిణామాలు విజయ్ రాజకీయ భవిష్యత్తును నిర్ణయించనున్నాయి. సుమారు 35 మంది అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు విజయ్‌కు మద్దతు ఇవ్వాలని యోచిస్తున్నట్లు వార్తలు వస్తున్నా, పార్టీ అధినేత పళనిస్వామి మాత్రం ఇప్పటికీ మౌనం పాటిస్తున్నారు. ఒకవేళ అన్నాడీఎంకే గనుక మద్దతు ఇవ్వకుంటే, విజయ్ ప్రభుత్వం ఏర్పడినా అది స్వల్పకాలికంగానే ఉండే ప్రమాదం ఉందన్న అభిప్రాయం వినిపిస్తోంది.

### సింగిల్ నినాదంపై విమర్శలు

ఎన్నికల ప్రచారంలో ద్రావిడ పార్టీల అవసరం లేదని, ఒంటరిగానే పోరాడతానని చెప్పిన విజయ్.. ఇప్పుడు మెజారిటీ కోసం ఇతర పార్టీల వాకిట నిలబడటంపై విమర్శలు వస్తున్నాయి. ముఖ్యంగా కాంగ్రెస్‌తో చేతులు కలపడం ఆయన స్వయంశక్తి నినాదానికి విరుద్ధమని డీఎంకే శ్రేణులు ఎద్దేవా చేస్తున్నాయి. అధికార దాహంతోనే విజయ్ తన రాజకీయ విలువలను పక్కన పెట్టారని సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది.

### చెన్నైలో ఉత్కంఠ - గడువు దగ్గర పడుతుండటంతో..

ప్రభుత్వ ఏర్పాటుకు గడువు సమీపిస్తుండటంతో విజయ్ తన క్యాంపును పటిష్టం చేసే పనిలో పడ్డారు. అన్నాడీఎంకే అసమ్మతి ఎమ్మెల్యేలతో పాటు, స్వతంత్రులతోనూ రాయబారాలు నడుపుతున్నారు. మరోవైపు పరాజయం పాలైన డీఎంకే, ఉదయనిధి స్టాలిన్ నేతృత్వంలో ప్రతిపక్ష హోదాలో బలమైన ముద్ర వేసేందుకు సిద్ధమవుతోంది. మొత్తం మీద తమిళనాడులో విజయ్ పట్టాభిషేకం జరుగుతుందా లేక రాజకీయ అనిశ్చితి నెలకొంటుందా అన్నది మరికొద్ది గంటల్లో తేలనుంది.

# టీవీకే అధినేత విజయ్‌కు బిగ్ షాక్

రాష్ట్ర ప్రభుత్వం ఫేజ్-2లో ఏడు కారిడార్లతో మొత్తం 122.9 కి.మీ మేర విస్తరణకు, రూ. 38,595 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన సమగ్ర డీపీఆర్‌ను ఇప్పటికే సమర్పించామని సీఎం తెలిపారు.

హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2 ప్రాజెక్ట్ ను భారత ప్రభుత్వం -- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్ గా చేపట్టేందుకు త్వరగా ఆమోదం తెలపాలని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

### మెట్రో-3 డీపీఆర్‌ను సమర్పించాం

హైదరాబాద్ నగర భవిష్యత్ అవసరాల దృష్ట్యా ఆర్జీఐ ఎయిర్‌పోర్ట్ -- భారత్ ఫ్యూచర్ సిటీ కారిడార్‌ను మెట్రో ఫేజ్-3గా చేపట్టాలని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మెట్రో ఫేజ్-3కి సంబంధించిన డీపీఆర్ ను ఇప్పటికే సమర్పించామని కేంద్ర మంత్రికి సీఎం తెలిపారు. సమావేశంలో కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ కార్యదర్శి కె.శ్రీనివాస్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్ రెడ్డి, హెచ్ఎంఆర్ఎల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (పట్టణ రవాణా) ఎన్.వి.ఎస్.రెడ్డి, ఢిల్లీ తెలంగాణ భవన్ ప్రత్యేకాధికారి సంజయ్ కుమార్, కేంద్ర ప్రభుత్వ పథకాల సమన్వయ కార్యదర్శి అద్వైత్ కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## సీవీడ్ ఆదాయంపై

# ఎకనమిక్ మోడల్ సిద్ధం చేయండి

సాగుకు కంపోస్టు ఎరువును సరఫరా చేసేలా చూడాలన్నారు. ఈ ఏడాది 42.06 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న పంట ఉత్పత్తి వస్తుందని అధికారులు వివరించారు. మొక్క జొన్న సహా ఇతర పంటల ద్వారా ఇథనాల్ తయారీకి ఉన్న అవకాశాలను అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి సూచనలు చేశారు. మామిడిని ప్రాసెసింగ్ యూనిట్లు కొనుగోలు చేసేలా చూడాలని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. అరటి, ఆయిల్ పామ్, మిర్చి, కోకో లాంటి పంటలకు సంబంధించి ధరల సమస్య లేదని రైతులకు మంచి ధర లభిస్తోందని అధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి వివరించారు.

### మదనపల్లె లో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్

సీజన్ కంటే ముందే రాష్ట్రంలోని నీటి వనరుల్లో ఫిష్ సీడ్ ను సరఫరా చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. వచ్చే పంట సీజన్ కు 7.5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని అధికారులు తెలిపారు. నాఫెడ్ నుంచి మినుములు ఇతర వాణిజ్య పంటల్ని కొనుగోలు చేస్తున్నామని మంత్రి అచ్చెన్నాయుడు ముఖ్యమంత్రికి వివరించారు. పీఎండీఎస్ పథకం ద్వారా తక్కువ యూరియా వినియోగానికి ఇచ్చే ప్రోత్సాహకం పై కేంద్రంతో మాట్లాడాలని సీఎం వారికి సూచించారు. మదనపల్లె లో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటు కానుందని సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడించారు.

### సముద్ర తీరప్రాంతాల్లో సీవీడ్ కల్టివేషన్

మరోవైపు రాష్ట్రంలోని సముద్ర నాచు ఉత్పత్తులు, విలువ జోడింపు తదితర అంశాల్లో మహిళలు ఆదాయాన్ని ఆర్జించేందుకు వీలుగా ఓ ఎకనామిక్ మోడల్ ను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. సముద్ర తీర ప్రాంతాల్లో సీవీడ్ ఫార్మింగ్ తో స్వయం సహాయ సంఘాల మహిళలు, మత్స్యకారులకు అదనపు ఆదాయాల కల్పనపై సీఎం సమీక్ష నిర్వహించారు. సీవీడ్ కల్టివేషన్ ద్వారా ఎస్ హెచ్ జీ మహిళల ఆదాయ మార్గాలు పెరిగేలా చర్యలు చేపట్టాలని సీఎం సూచనలు చేశారు. ఏపీలోని సముద్ర తీరప్రాంతాల్లో సీవీడ్ కల్టివేషన్ కు విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు సెంట్రల్ సాల్ట్ మెరైన్ రీసెర్చి ఇనిస్టిట్యూట్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ, సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ బ్రాకిష్ వాటర్ ఆక్వాకల్చర్, సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ తదితర సంస్థల ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయడు వర్చువల్‌గా మాట్లాడారు.

### సీవీడ్ ఆదాయంపై ఎకనామిక్ మోడల్

అమృతా విశ్వ విద్యాపీఠంతో కలిసి మహిళలకు సీవీడ్ కల్చర్ సాగుకు సంబంధించిన అంశాలపై ఓ నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. సీవీడ్ ద్వారా వచ్చే ఆదాయంపై ఓ ఎకనామిక్ మోడల్ ను సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని సుదీర్ఘమైన తీరప్రాంతంలో సముద్ర నాచు సాగు ద్వారా మహిళలకు ఉపాధి కల్పించేలా వాణిజ్య స్థాయిలో ఉత్పత్తి వచ్చేలా ప్రణాళికలు చేయాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. సీవీడ్ ద్వారా వివిధ ఉత్పత్తులు తయారు చేసేందుకు విలువ జోడించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వాణిజ్య స్థాయిలో ఉత్పత్తి కోసం జాతీయ, అంతర్జాతీయ సంస్థలను కూడా సంప్రదించాలన్నారు. మెరైన్ ఉత్పత్తిగా సంపద సృష్టికి సీవీడ్ ఓ కీలకమైన ప్రత్యామ్నాయం అవుతుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఫార్మా సహా, న్యూట్రాసిటికల్ ఉత్పత్తుల్లో ప్రధానమైన ముడిసరుకు గా ఈ సీవీడ్ అంతర్జాతీయ మార్కెట్ ను అందుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు.

# హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో అవినీతి

ఈ అవినీతి,అక్రమాలపై ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూముల్లో కొనసాగుతున్న హెచ్ పీఎస్ ఈ ఏడాది 120 శాతం ఫీజు పెంచిందని చెప్పారు. ప్రభుత్వ స్థలంలో కొనసాగే స్కూళ్లలోనే పరిస్థితి ఇలా ఉంటే బడా ప్రైవేట్ స్కూళ్లలో పరిస్థితి ఏంటని ఆమె ప్రశ్నించారు.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో ఒకే వ్యక్తి గత 14 ఏళ్లుగా అదే పదవిలో కొనసాగుతూ అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. మైక్రోసాఫ్ట్ సీఈఓ హెచ్‌పీఎస్ పూర్వపు విద్యార్థి అయిన సత్య నాదెళ్ల స్కూలుకు ఇచ్చిన విరాళాలకు లెక్కాపత్రం లేదని ఆమె అన్నారు.ఆ విరాళాలు దారి మళ్లాయని ఆమె ఆరోపించారు. క్యాంపస్‌లో 30 ఎకరాల మేరా భూమిని కబ్జా చేసే పనిలో సీఎం సన్నిహితులు కొందరున్నారని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. హెచ్‌పీఎస్ పనితీరుపై సమగ్ర సమీక్ష జరిపి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

### దోపిడీకి పాల్పడుతున్న ప్రైవేట్ స్కూల్స్

ఇక పెరుగుతున్న ఫీజులపై మాట్లాడిన కవిత ఫీజు నియంత్రణ చట్టాలను తుంగలో తొక్కే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. ప్రైవేట్ విద్యా సంస్థల దోపిడీలను అరికట్టాల్సిన ముఖ్యమంత్రే ప్రైవేట్ స్కూల్ ప్రారంభోత్సవాలకు వెళుతున్నారని ఎద్దేవా చేశారు.ఫీజుల విషయంలో దోపిడీని అరికట్టాల్సిందే అని డిమాండ్ చేసిన కవిత ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తే మాత్రం ఊరుకునేది లేదని వార్నింగ్ ఇచ్చారు.ఈ ఏడాది ఒక్క రూపాయి కూడా ఫీజు పెంచకుండా జీవో జారీచేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో విద్య వైద్యం కోసమే కుటుంబాలు 60 నుంచి 70శాతం వరకు వారి ఆదాయాన్ని ఖర్చు చేస్తున్నారని గుర్తుచేశారు. తమ పిల్లలకు మంచి చదువులు చెప్పించాలనే తల్లిదండ్రుల బలహీనతను ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు ఆసరాగా చేసుకుని భారీగా ఫీజులు పెంచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### ప్రభుత్వానికి హెచ్చరిక

ప్రైవేట్ విద్యా సంస్థల దోపిడీని అరికట్టకపోగా...ఫీజు రీయింబర్స్ మెంట్ ను కూడా బొందపెట్టే కుట్ర ఈ ప్రభుత్వం చేస్తోందని కవిత మండిపడ్డారు. ప్రభుత్వం కొత్తగా తెచ్చిన ఎంఎస్-7 జీవో తో ఫీజు రీయింబర్స్ మెంట్ కు మంగళం పాడే ప్రయత్నం చేస్తున్నారన్నారు.తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధికారంలోకి వస్తే ప్రైవేట్ విద్యాసంస్థలు, ఆసుపత్రుల్లో కూడా పేదలకు ఉచిత విద్య, వైద్యం అందిస్తామని మరోసారి తేల్చి చెప్పారు.ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం తప్పదని కవిత హెచ్చరించారు.త్వరలోనే తమతో కలిసి వచ్చే అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని కలెక్టరేట్ల వద్ద ఆందోళన చేస్తామని చెప్పారు.

## 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల

# ఆర్థిక వ్యవస్థగా ఏపీ

కేవలం డేటా సెంటర్లను ఏర్పాటు చేయడమే కాకుండా, వాటికి అవసరమైన కూలింగ్ సిస్టమ్స్, చిల్లర్స్, పవర్ ఎలక్ట్రానిక్స్ వంటి పరికరాల తయారీలో ఏపీని గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని లోకేష్ వివరించారు.

ఫార్మా రంగంలో భారత్ ఏవిధంగా అగ్రగామిగా ఉందో, డేటా సెంటర్ కాంపోనెంట్స్ తయారీలో కూడా అదే స్థాయి నాయకత్వాన్ని సాధించగలమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. విశాఖను గ్లోబల్ ఏఐ హబ్‌గా మార్చే ప్రక్రియలో ఇదొక కీలక అడుగు అని తెలిపారు.

### 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికతతో 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని లోకేష్ స్పష్టం చేశారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, పెట్టుబడులు కేవలం నిధుల కోసం మాత్రమే కాకుండా యువతకు నైపుణ్యం, ఉపాధి కల్పన కోసమని ఆయన పేర్కొన్నారు. పరిశ్రమలకు అవసరమైన శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేకంగా నైపుణ్యం పోర్టల్ ను అందుబాటులోకి తెస్తున్నట్లు వెల్లడించారు.

### డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్

రాష్ట్రంలో ప్రస్తుతం నమో నరేంద్ర మోదీ - చంద్రబాబు నాయుడు కలయికతో డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ వేగంతో పాలన సాగుతోందని మంత్రి అభివర్ణించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తమ ప్రభుత్వ ప్రత్యేకతని, ఒక్క జూమ్ కాల్‌తోనే ఆర్సెలార్ మిట్టల్ వంటి సంస్థలను రాష్ట్రానికి రప్పించగలిగామని గుర్తుచేశారు. పరిశ్రమలకు ఏ అవసరం వచ్చినా కేవలం ఒక వాట్సాప్ మెసేజ్ దూరంలో ప్రభుత్వం అందుబాటులో ఉంటుందని పారిశ్రామికవేత్తలకు భరోసా ఇచ్చారు.

### శ్రీసిటీ మేక్ ఇన్ ఇండియాకు రోల్ మోడల్

8,500 ఎకరాల్లో విస్తరించి, 31 దేశాలకు చెందిన 250 కంపెనీలతో శ్రీసిటీ ప్రపంచ స్థాయి తయారీ కేంద్రంగా నిలిచిందని లోకేష్ కొనియాడారు. క్యారియర్ సంస్థ ఇక్కడ ప్లాంట్‌తో పాటు రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

# రైతుల రక్తం తాగిన పార్టీ కాంగ్రెస్

అధికారాన్ని చేజిక్కించుకుందని ఆయన విమర్శించారు. రైతు డిక్లరేషన్‌లో పొందుపరిచిన 34 హామీలు ఇప్పుడు ఏ గాలిలో కలిసిపోయాయని ఆయన సూటిగా ప్రశ్నించారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై తన విమర్శలను మరింత ఉధృతం చేస్తూ, రైతు డిక్లరేషన్ అనేది కేవలం ఒక బోగస్ పత్రమని, అది ప్రజలను వంచించేందుకు రూపొందించిన చిత్తు కాగితమని కేటీఆర్ మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమాలు రైతులకు మేలు చేసే 'మేళాలు' కావు, అవి కేవలం 'దగా మేళాలు' అని ఆయన ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు 100 రోజుల్లోనే అన్ని హామీలను నెరవేరుస్తామని ప్రగల్భాలు పలికి, ఇప్పుడు నెలలు గడుస్తున్నా అతీగతీ లేకపోవడాన్ని ఆయన తప్పుబట్టారు. కాంగ్రెస్ మాటలు నమ్మి ఓట్లు వేసిన అన్నదాతలు నేడు అరిగోస పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అధికారంలోకి రాకముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీలు రైతులకు ఇచ్చిన హామీలను కేటీఆర్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. గత కేసీఆర్ ప్రభుత్వం ఎకరాకు రూ. 10 వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తే, తాము అధికారంలోకి వస్తే రూ. 15 వేలు ఇస్తామని ఆశ చూపిన కాంగ్రెస్, ఇప్పటివరకు పూర్తిస్థాయిలో న్యాయం చేయలేదని ధ్వజమెత్తారు. "దొంగలొస్తున్నారు జాగ్రత్త" అని రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఫోటోలను పోలీస్ స్టేషన్లలో అంటించే పరిస్థితి వచ్చిందని వ్యాఖ్యానించారు. చెడ్డీ గ్యాంగ్ కంటే కాంగ్రెస్ గ్యాంగ్ రాష్ట్రానికి అత్యంత ప్రమాదకరమని ఆయన హెచ్చరించారు.చివరగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలపై కేటీఆర్ సెటైర్లు వేశారు. ఇప్పటి వరకు రేవంత్ రెడ్డి 69 సార్లు ఢిల్లీకి వెళ్లారని, కానీ రాష్ట్ర రైతు ప్రయోజనాల కోసం కేంద్రం నుంచి 69 పైసలైనా తెచ్చారా అని నిలదీశారు. రాష్ట్రంలో వడ్ల కొనుగోళ్ల ప్రక్రియలో విపరీతమైన జాప్యం జరుగుతోందని, ఇదే పరిస్థితి కొనసాగితే రైతులు ఆగ్రహంతో కాంగ్రెస్ నాయకులను ఊరూరా తరిమికొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని ఆయన హెచ్చరించారు. రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ విశ్రమించదని, క్షేత్రస్థాయిలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని కేటీఆర్ పునరుద్ఘాటించారు.

# సీపీ సీక్రెట్ ఆపరేషన్

నిర్ణయించుకున్న మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి ఐపీఎస్ సాధారణ మహిళగా మారి అర్ధరాత్రి రంగంలోకి దిగారు. ఆమె చేపట్టిన సీక్రెట్ ఆపరేషన్ ఇప్పుడు పోకిరీల గుండెల్లో వణుకు పుట్టిస్తోంది. దిలుసుఖ్‌నగర్ ప్రాంతంలో మహిళలపై వేధింపులు ఎక్కువయ్యాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో ఆమె ఎవరూ ఊహించని రీతిలో ఒక సాహసోపేతమైన ఆపరేషన్‌కు శ్రీకారం చుట్టారు.ఇటీవల ఆమె మల్కాజిగిరి సీపీగా బాధ్యతలు స్వీకరించగా ఆ తర్వాతి రోజే అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఎలాంటి భద్రతా సిబ్బంది లేకుండా సాదాసీదా దుస్తుల్లో ఒక సామాన్య మహిళలా దిలుసుఖ్ నగర్ బస్టాండ్‌కు వద్దకు చేరుకున్నారు. అక్కడ బస్సు కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికురాలిలా నిల్చున్నారు. కమిషనర్ అని తెలియని దాదాపు 40 మంది పోకిరీలు ఆమెను చుట్టుముట్టారు. మద్యం, గంజాయి మత్తులో ఉన్న యువకులు ఆమెపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేస్తూ.. 'వస్తావా.. రేటెంత?' అంటూ దారుణంగా వేధించారు. అర్ధరాత్రి 12 నుండి తెల్లవారుజామున 3 వరకు సుమారు మూడు గంటల పాటు ఆమె ఆ నరకాన్ని మౌనంగా భరిస్తూనే అక్కడి పరిస్థితులను గమనించారు.ఈ క్రమంలో పోలీసుల వైఫల్యం కూడా బట్టబయలైంది. మూడు గంటల పాటు ఆ పరిసరాల్లో ఒక్క పెట్రోలింగ్ వాహనం కూడా కనిపించలేదు. చివరకు తెల్లవారుజామున 3:30 గంటలకు ఒక బీట్ కానిస్టేబుల్ అటువైపు వచ్చారు. వరుసగా మూడు రోజుల పాటు ఇదే తరహాలో నిఘా పెట్టిన సుమతి మొత్తం 40 మంది పోకిరీలను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వీరిలో అత్యధికంగా హాస్టల్స్‌లో ఉంటూ చదువుకోవాల్సిన విద్యార్థులే ఉండటం గమనార్హం. మద్యం, డ్రగ్స్ మత్తులో విద్యార్థులు దారి తప్పుతున్నారని, మహిళలు ఒంటరిగా కనిపిస్తే మృగాల్లా ప్రవర్తిస్తున్నారని కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితులందరికీ కౌన్సిలింగ్ నిర్వహించడంతో పాటు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన పెట్రోలింగ్ సిబ్బందిపై కూడా ఆమె సీరియస్ అయ్యారు. నగరంలో మహిళల భద్రత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఇకపై ఇలాంటి ఆపరేషన్లు నిరంతరం కొనసాగుతాయని ఆమె హెచ్చరించారు. బాధ్యతలు చేపట్టిన తొలిరోజే ఫీల్డ్‌లోకి దిగి నేరగాళ్ల ఆట కట్టించిన సుమతి సాహసం ఇప్పుడు సర్వత్రా ప్రశంసలు అందుకుంటోంది. నగర వ్యాప్తంగా ఉన్న ఇలాంటి పోకిరీల ఆట కట్టించాలని ప్రజలు కోరుతున్నారు.


## సంచార, దళిత, పీడిత కులాల పిల్లల

# చదువే టీడీపీ ప్రభుత్వ లక్ష్యం

సంచార, దళిత, పీడిత కులాల పిల్లల చదువే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ లక్ష్యమని, బేడ బుడగ జంగం కులానికి తెలుగుదేశం పార్టీ ద్వారానే న్యాయం జరుగుతుందని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.బుధవారం నంద్యాల వై ఎస్ ఆర్ నగర్ లోని బేడ బుడగ విద్యార్థుల వసతి గృహంలో విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతి కార్యక్రమంలో నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ బేడ బుడగ జంగం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తూర్పాటి మనోహర్ ను తాను చిన్నప్పటి నుంచి చూస్తున్న, తన కులం బాగుకోసం నిరంతరం పనిచేస్తున్నాడని అభినందించారు. పిల్లల భవిష్యత్ కోసం మనోహర్ లాంటి వారు అవసరం అన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి -నారా చంద్రబాబు నాయుడు బేడ బుడగ జంగం ఎస్ సి రిజర్వేషన్ కోసం అసెంబ్లీలో రెండు సార్లు ఏకగ్రీవంగా తీర్మానం చేసి పార్లమెంట్ కు పంపారని, తాను బేడ బుడగ జంగం ఎస్ సి రిజర్వేషన్ కోసం రెండు సార్లు పార్లమెంట్ దృష్టికి తీసుకెళ్లానని, టీడీపీ మీకు న్యాయం జరిగేంత వరకు అండగా ఉంటుందని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి భరోసా ఇచ్చారు. బిక్షాటనతో సంచార జాతి బిడ్డల చదువుకు దూరంగా ఉంటున్నారని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి రాష్ట్రంలోనే మొట్ట మొదటగా ప్రత్యేకంగా బుడగ జంగాల అర్బన్ రెసిడెన్సీ వసతి నంద్యాలలో ప్రభుత్వ ఏర్పాటు మంచి పరిణామం అన్నారు. రాష్ట్ర అధ్యక్షులు తూర్పాటి మనోహర్ మాట్లాడుతూ పార్లమెంట్ లో బేడ బుడగ జంగం కులానికి ఎస్ సి రిజర్వేషన్ కోసం కృషి చేయాలని, నంద్యాల వసతి గృహంకు ప్రభుత్వం స్థలం కేటాయించి శాశ్వత భవనాలు ఏర్పాటు చేయాలని, అర్బన్ రెసిడెన్సీయల్ వసతిని అర్బన్ పదం కాకుండా రెసిడెన్సీయల్ గా మార్పుకు చర్యలు తీసుకువాలని, విద్యార్థులకు మినరల్ వాటర్ ప్లాంట్ మంజూరు చేయాలని కోరగా వెంటనే ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబ్దరి స్పందించి జిల్లా కలెక్టర్ ద్వారా 40 సెంట్ల ప్రభుత్వ స్థలం వసతి గృహంకు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని, ఎంపీ నిధులతో మినరల్ వాటర్ ప్లాంట్ మంజూరు చేస్తున్నామని, బిక్షాటన మాని ఇక్కడ చదువుకుంటున్న విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలు అవరోధించాలని, ఇక్కడ చదివి ఇటీవల 10 వ తరగతి పరీక్షల్లో 450 మార్కులు సాధించిన విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకోవాలని, మీకు ఏ సమస్య వచ్చినా తనను సంప్రదించాలని టీచర్స్, విద్యార్థులను ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కోరారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు ఎంపీ, డి ఈ ఓ జనార్దన్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్వ శిక్ష ప్రాజెక్టు కో - ఆర్డినేటర్ నిత్యానందరాజులు, కేంద్ర ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ నరహరి విశ్వనాధ్ రెడ్డి, ఆప్కాబ్ రాష్ట్ర మాజీ చైర్మన్ బి ఎస్ నవీన్ కుమార్, బేడ బుడగ జంగం రాష్ట్ర అధికార ప్రతినిధి తాటికొండ బుగ్గరాముడు, ఎస్ సి, ఎస్ టి మానిటరింగ్ కమిటీ సభ్యురాలు ఎరుకల రాజేశ్వరమ్మ, హాస్టల్ నిర్వాహకులు గడ్డం సుబ్బారాయుడు. జమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

## మహిళా బిల్లు ఓడించామని సంబరాలు చేసుకున్న పార్టీలకు ఓటు అనే చెప్పుతో బుద్ధిచెప్పారు.

**- నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.**




ఇటీవల పార్లమెంట్ లో మహిళా బిల్లు ఓడించామని సంబరాలు చేసుకున్న డి ఎం కె, తృణమూల్ కాంగ్రెస్, కాంగ్రెస్ పార్టీలకు ఓటు అనే చెప్పుతో కొట్టి ఓడించి మహిళలే బుద్ధి చెప్పారని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. బుధవారం నంద్యాల నూనెపల్లె మార్కెట్ యార్డు ఆవరణలో నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ నూతన కార్యాలయం నిర్మాణంకు ఘనంగా భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్ డి ఏ ప్రభుత్వం ఇటీవల పార్లమెంట్ లో మహిళా రిజర్వేషన్ బిల్లు పెడితే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు దక్కకూడదు అన్న దురుద్దేశ్యంతో కాంగ్రెస్, వాటి అనుబంధ కూటమి డి ఎం కె, తృణమూల్ కాంగ్రెస్, కాంగ్రెస్ పార్టీలు మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్ లో తీవ్రంగా వ్యతిరేకించి బిల్లు ఓడిపోవడానికి కారణం అయ్యాయని, మహిళా బిల్లు ఓడించామని పార్లమెంట్ లోనే సంబరాలు చేసుకున్న కాంగ్రెస్, డి ఎం కె, తృణమూల్ కాంగ్రెస్ పార్టీలకు ఆనాడే చెప్పాను మీకు తగిన గుణపాఠం తప్పదని, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలు ఓటు అనే చెప్పుతో కొట్టి ఓడించి బుద్ధి చెప్పారని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. రాబోవు ఆరు నెలల్లో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్ డి ఏ ప్రభుత్వం పార్లమెంట్ లో మహిళా రిజర్వేషన్ బిల్లు పెట్టి ఆమోదం పొంది మహిళలకు ఇచ్చిన హామీ మేరకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామన్న ధీమా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి వ్యక్తం చేశారు.

# చేతులు కలపనున్న డీఎంకే, అన్నాడీఎంకే

## - తమిళ రాజకీయాల్లో కొత్త ట్విస్ట్! పార్టీల రహస్య చర్చలు!



చెన్నై (ప్రశ్న న్యూస్) తమిళనాడుతో పాటు దేశ రాజకీయాల్లో పెను సంచలనం రేపే ఒక వార్త ఇప్పుడు వైరల్ అవుతోంది. దశాబ్దాల క్రితం డీఎంకే నుంచి విడిపోయి అన్నాడీఎంకేగా ఏర్పడి అప్పటి నుంచి ఇప్పటి వరకు బద్ధ శత్రువులుగా అధికారం కోసం పోరాటం చేస్తున్న రెండు పార్టీలు ఒక్కటి కానున్నట్లు వార్తలు రావడం ప్రస్తుతం రాజకీయాల్లో పెను సంచలనం రేపుతున్నాయి. డీఎంకే, అన్నాడీఎంకే కలిసి తమిళనాడులో కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు రహస్య చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ ఈ చర్చలు ఫలించి ద్రవిడ పార్టీలు కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే అది తమిళనాడులో దశాబ్దాల డీఎంకే, అన్నాడీఎంకే దాయాదుల పోరుకు ఫుల్‌స్టాప్ పడుతుందని అంతా భావిస్తున్నారు. ఇటీవల జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే పార్టీ 59 స్థానాల్లో విజయం సాధించింది. అదే సమయంలో అన్నాడీఎంకే పార్టీ 47 సీట్లలో గెలిచింది. అయితే ఈ రెండు పార్టీలు కలిస్తే వీరి బలం 106 సీట్లకు చేరుకుంటుంది. తమిళనాడు అసెంబ్లీలో మేజిక్ ఫిగర్ 118 కాగా మెజార్టీని సాధించాలంటే వీరికి మరో 12 సీట్లు కావాల్సి ఉంటుంది. దీంతో మిగిలిన చిన్న పార్టీల మద్దతు కోరే అవకాశాలు ఉన్నాయి. ఈ క్రమంలోనే సీపీఐ 2, సీపీఎం 2, వీసీకే 4 వంటి పార్టీలు కూడా మద్దతు ఇవ్వనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీల మద్దతు లేకుండా ప్రాంతీయ పార్టీలతోనే అధికారాన్ని చేపట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇలా చేయడం వల్ల ద్రవిడ పార్టీల మనుగడ ప్రశ్నార్థకం కాకుండా రెండు పార్టీలు అడ్డుకున్నట్లు కానుంది. అయితే ఇది జరుగుతుందా లేదా డీఎంకే, అన్నాడీఎంకే పార్టీలు కలుస్తాయా లేదా అనేది తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు ఆగాల్సిందే. మరోవైపు తమిళనాడు ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలిచిన టీవీకే పార్టీ 108 సీట్లతో సింగిల్ లార్జెస్ట్ పార్టీగా అవతరించింది. ఈ నేపథ్యంలోనే ఐదుగురు ఎమ్మెల్యేల బలం ఉన్న కాంగ్రెస్ పార్టీ కూడా మద్దతు ప్రకటించడంతో టీవీకే బలం 113కి చేరింది. ఈ క్రమంలోనే ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని విజయ్ నేతృత్వంలోని టీవీకే బృందం తమిళనాడు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను కలిసి విజ్ఞప్తి చేయగా మెజార్టీ నిరూపించుకోవాలని చెప్పినట్లు తెలుస్తోంది. అయితే 2 వారాల సమయం ఇస్తే తాను మెజార్టీని నిరూపించుకుంటానని చెప్పినా ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ ఆమోదం తెలపలేదని సమాచారం.

# జోనల్ కమిషనర్ పేరుతో మోసాలు

## - అందిన కాడికి దండుకున్న కేటుగాడు - పోలీసుల అదుపులో నకిలీ జోనల్ కమిషనర్ - పోలీస్ స్టేషన్‌కు క్యూ కడుతున్న బాధితులు








**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** అతను ఒక మామూలు కారు డ్రైవర్, అయితే అక్రమ సంపాదన కోసం నకిలీ జోనల్ కమిషనర్ గా మారాడు. తాను జోనల్ కమిషనర్ అని. తాను ఏది చెప్తే అది జరుగుతుందని. పలు టీ స్టాల్స్ ను రోడ్ల పక్కన చిరు వ్యాపారస్తులు వేసుకున్న డబ్బులకు అనుమతులు లేవని వాటిని కూల్చివేస్తానంటూ జనాలను భయపెడుతూ అందిన కాడికి దోచుకుంటున్న వ్యక్తిని మేడ్చల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విషయం తెలుసుకున్న బాధితులు మేడ్చల్ పోలీస్ స్టేషన్ కు క్యూ కడుతున్నారు.

### వివరాలు ఇలా ఉన్నాయి

మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ కు చెందిన శ్రీకాంత్ అనే వ్యక్తి వృత్తి రిత్య కార్ డ్రైవర్. అయితే అక్రమంగా డబ్బులు సంపాదించాలన్న దురాశతో నకిలీ జోనల్ కమిషనర్ అవతారం ఎత్తాడు. తను సీక్రెట్ గా నియమించబడ్డ జోనల్ కమిషనర్ ను అంటూ ప్రజలను నమ్మించే ప్రయత్నం చేశాడు. తాను ఎంత చెప్తే అంతేనని మేడ్చల్ డిప్యూటీ కమిషనర్ తాను నిరంతరం మాట్లాడుకుంటామని, అంటూ ప్రజలకు మోసపూరిత మాటలను చెబుతూ అందిన కాడికి దోచుకున్నాడు. ఎమ్మెల్యే మల్లారెడ్డి, మల్కాజ్గిరి ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి తన ఇంటికి వచ్చి సీక్రెట్ గా మాట్లాడి వెళ్తారని, సమయం వచ్చినప్పుడు తాను ఎంత పెద్ద అధికారినో బయటపడుతుందని, తాను ఒక సంతకం పెడితే చాలు అక్రమ కట్టడాలను అధికారులు కూల్చి వేస్తారని కనిపించిన వారందరికీ చెప్పుతూ వచ్చాడు. మేడ్చల్ పట్టణం కేఎల్ఆర్ లో ఉన్న టీ స్టాల్స్ అన్ని అక్రమంగా నిర్మించారని తాను అడిగినంత ఇస్తే అక్రమ నిర్మాణాలను కూల్చి వేయకుండా ఉంటాం అంటూ నమ్మిస్తూ మోసాలకు దిగాడు. అప్పటికే ఓ టీ స్టాల్ యజమాని నుండి రూ. 5 వేలు తీసుకున్నాడు. మరో రూ. 7వేలు కావాలంటూ ఒత్తిడి చేయడంతో సదరు టీ స్టాల్ యజమానికి అనుమానం వచ్చి 100కు డయల్ చేసి మేడ్చల్ పోలీసులకు పట్టించాడు. ఈ విషయం తెలుసుకున్న బాధితులు మేము సైతం మోసపోయాం అంటూ ఒకరు ఒకరు బయటకు వచ్చారు. ప్రస్తుతం నకిలీ జోనల్ కమిషనర్ శ్రీకాంత్ పోలీస్ అదుపులో ఉండడంతో బాధితులు పోలీస్ స్టేషన్ టూ క్యూ కట్టారు.

### - జిహెచ్ఎంసి సిబ్బంది నరేష్ కు నకిలీ అధికారి శ్రీకాంత్‌కు సంబంధం ఏంటి.?

నకిలీ జోనల్ కమిషనర్ శ్రీకాంత్ చేతిలో మేడ్చల్ జిహెచ్ఎంసి సిబ్బంది నరేష్ సైతం మోసపోయినట్లు సమాచారం. ప్రమోషన్ ఇప్పిస్తానంటూ సదరు నకిలీ అధికారి శ్రీకాంత్ మేడ్చల్ జిహెచ్ఎంసి కార్యాలయంలో పనిచేసే శానిటేషన్ ఫీల్డ్ అధికారి ( ఎస్ ఎఫ్ ఏ )నరేష్ కు పదోన్నతి కల్పిస్తాను అంటూ నరేష్ను తన బుట్టలో వేసుకున్నాడు. అతని వద్దనుండి నకిలీ అధికారి శ్రీకాంత్ రూ. 50 తీసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా సదరు నకిలీ అధికారి శ్రీకాంత్ పదిమందిలో ఉండగా జిహెచ్ఎంసి కి చెందిన శానిటరీ ఫీల్డ్ అధికారి నరేష్ శ్రీకాంత్ ను సార్ సార్ అంటూ పిలవడంతో జనాలు నకిలీ అధికారి శ్రీకాంత్ నిజమేనా అధికారి కావచ్చు నేమో అంటూ నమ్మినట్లు తెలుస్తోంది ఒక జిహెచ్ఎంసి అధికారి సార్ సార్ అని పిలవడం వల్ల జనాలు నకిలీ అధికారిని నిజమైన అధికారి గా భావించినట్లు తెలుస్తోంది. వీరిద్దరి మధ్య అక్రమ లావాదేవీలు సాగినట్లు సమాచారం. పోలీసులు లోతుగా విచారణ జరుగుతే వాస్తవాలు బయటకు వస్తాయని స్థానికులు పేర్కొంటున్నారు. శానిటరీ ఫీల్డ్ అధికారి నరేష్ కు ఈ నకిలీ జోనల్ కమిషనర్ ఎలా అర్థం కావడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. నరేష్ ను ప్రశ్నిస్తే అసలు విషయం బయటకు వస్తుందని స్థానికులు పేర్కొంటున్నారు

### - పారిశుద్ధ్య కార్మికుల కు నకిలీ జోనల్ కమిషనర్ చుక్కలు

తాను జోనల్ కమిషనర్ ను అంటూ పారిశుద్ధ్య కార్మికుల కు చుక్కలు చూపించినట్టు తెలుస్తుంది. తాను చెప్పినట్టు చెయ్యాలి అంటే రాత్రి 11 గంటల వరకు పారిశుద్ధ్య కార్మికులచే పనులు చేయించినట్లు పారిశుద్ధ్య కార్మికులు ఆరోపిస్తున్నారు. రాత్రి 11 గంటల వరకు రోడ్లను ఓడిపిస్తూ తాను చెప్పే వరకు పనులు చేయాలి లేకపోతే ఉద్యోగాలను తీసేస్తానంటూ బెదిరించారని బాధితులు తెలిపారు. కేఎల్ఆర్ ప్రాంతంలో తాను మారువేషంలో ఉన్న జోనల్ కమిషనర్ ను అంటూ పాన్ డబ్బాల నుండి సిగరెట్లను తీసుకెళ్లడం.. ఇదేమిటి ప్రశ్నిస్తే నేను జోనల్ కమిషనర్ ను.. నన్ను డబ్బులు అడుగుతున్నావా.. మీ సిగరెట్ డబ్బా లేకుండా చేస్తానంటూ బెదిరింపులకు పాల్పడ్డట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### పోలీస్ స్టేషన్ కు క్యూ కట్టిన బాధితులు

నకిలీ జోనల్ కమిషనర్ ను పోలీసులు అదుపులో కి తీసుకున్నారు అన్న విషయం తెలవడంతో బాధితులు పోలీస్ స్టేషన్ కు క్యూ కట్టారు. పోలీస్ స్టేషన్లో ఒక్కొక్కరు నకిలీ జోనల్ కమిషనర్ చేతిలో ఎలాఎ మోసపోయామో పోలీసులకు వివరించారు. దాదాపు 15 రోజులలోనే తాను జోనల్ కమిషనర్ అని ప్రజలను నమ్మించడం.. వారి వద్ద నుండి దాదాపు పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకోవడం జరిగిపోయింది.

# మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

## - శ్రీనిధి డిప్యూటీ జనరల్ మేనేజర్ మండే ధర్మేంద్ర




మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని,మహిళల ఆర్థిక ఎదుగుదలకు ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందని పల్నాడు,గుంటూరు,బాపట్ల కృష్ణా జిల్లాల శ్రీనిధి డిప్యూటీ జనరల్ మేనేజర్ మండే ధర్మేంద్ర అన్నారు.మండల కేంద్రమైన అమరావతిలో ల్యాంప్ ,జన చైతన్య సమితి (జె సి ఎస్)స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో జ్యూట్ తో పలు రకాల వస్తువుల తయారీపై శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు మంగళవారం సర్టిఫికెట్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ల్యాంప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్ పాల్ అధ్యక్షత వహించారు. ఈకార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ధర్మేంద్ర మాట్లాడుతూ మహిళలు స్వశక్తితో ఎదిగేందుకు ల్యాంప్,జె సి ఎస్ స్వచ్ఛంద సంస్థలు ఇచ్చిన శిక్షణను ఉపయోగించుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలను పారిశ్రామికవేత్తలుగా ఎదగాలననే లక్ష్యంతో చేయూతనందిస్తుందన్నారు. గుంటూరు జిల్లా శ్రీనిధి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వెంకటరమణ మాట్లాడుతూ మహిళలు శిక్షణ పొంది ఖాళీగా ఉండకుండా ప్లాస్టిక్ కు వ్యతిరేకంగా నేర్చుకున్న జ్యూట్ బ్యాగుల ద్వారా లబ్ధి పొందాలన్నారు.ల్యాంప్ సంస్థ డైరెక్టర్ సాల్మన్ పాల్ మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాలో మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు జూట్ పై ఉచితంగా శిక్షణ ఇస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో జన చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసరి విజయ్ బెన్నిబాబు,ల్యాంపు సంస్థ ప్రతినిధులు తురక మంగయ్య,కొండపల్లి వెంకటేశ్వరరావు,షేక్ బాజీ, జనచైతన్య సమితి కార్యదర్శి తుళ్లూరు సాంబశివరావు,షేక్ సుభాని,బెజ్జం నాగేశ్వరరావు, శిక్షకురాలు జుబేదా ఖాతున్, తదితరులు పాల్గొన్నారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు.

# బంగారు దుకాణాల యజమానులు, స్వర్ణకారులకు భద్రతా అవగాహన కార్యక్రమం నిర్వహణ

## - జిల్లా ఎస్పీ డి.జానకి,






**మహబూబ్‌నగర్** పట్టణంలోని విరాట్ విశ్వకర్మ సహకార సంఘం కార్యాలయం నందు బులియన్ మార్కెట్ మరియు స్వర్ణకారులు సంఘం సభ్యులతో కలిసి బంగారు దుకాణాల యజమానులు మరియు స్వర్ణకారులకు భద్రతా చర్యలపై అవగాహన కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ డి.జానకి, నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ, బంగారు దుకాణాలు మరియు స్వర్ణకారుల భద్రత కోసం పటిష్టమైన ఏర్పాట్లు అత్యవసరమని తెలిపారు. ప్రతి షాప్‌లో నాణ్యమైన సీసీ కెమెరాలు, నైట్ విజన్ కెమెరాలు ఏర్పాటు చేసి 24 గంటల పర్యవేక్షణ ఉండేలా చూడాలని సూచించారు. కెమెరాల ఫుటేజ్‌ను నిర్దిష్ట కాలం వరకు భద్రపరచడం, షాప్ ఎంట్రీ-ఎగ్జిట్ పాయింట్లు స్పష్టంగా కవరయ్యేలా ఏర్పాటు చేయడం కీలకమని పేర్కొన్నారు. అదేవిధంగా అలారం సిస్టమ్స్, సురక్షిత లాకర్లు వంటి భద్రతా ఏర్పాట్లతో పాటు మొబైల్ అలర్ట్ సిస్టమ్స్, యాక్సెస్ కంట్రోల్ వంటి ఆధునిక భద్రతా సాంకేతికతలను కూడా వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. అలాగే జిల్లా పోలీస్ అధికారులకు బంగారు షాపులు ఉన్న ప్రాంతాలలో గస్తీని మరింత బలోపేతం చేయాలని, నిరంతరం మొబైల్ పార్టీలు తిరుగుతూ పర్యవేక్షణ నిర్వహించాలని ఎస్పీ గారు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.అలాగే సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తూ, డిజిటల్ అరెస్ట్ మోసాలు, ఆన్‌లైన్ యాత్ర/టికెట్ బుకింగ్ మోసాలు, ఫేక్ కాల్స్ మరియు మెసేజెస్ ద్వారా డబ్బులు మోసగించే ఘటనలు పెరుగుతున్నాయని చెప్పారు. తెలియని లింకులు క్లిక్ చేయకుండా, అనుమానాస్పద కాల్స్‌కు స్పందించకుండా, వ్యక్తిగత మరియు బ్యాంకింగ్ వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. ఏవైనా అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే పోలీసులను సంప్రదించాలని తెలిపారు. రోడ్డు భద్రత కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని, స్వీయ భద్రతతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడడం ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు."ప్రజా భద్రతే మా ధ్యేయం" అనే నినాదంతో ప్రతి ఒక్కరూ పోలీసులతో సమన్వయం కలిగి పనిచేయాలని ఎస్పీ కోరారు.

# టెక్నికల్, బ్యాంకింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

## - జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

**రాజన్న సిరిసిల్ల** తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్ అండ్ నాలెడ్జ్ రీజనల్ సెంటర్లో టెక్నికల్ కోర్సులు, బ్యాంకింగ్ నందు ఉచిత శిక్షణ అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు.డిగ్రీ-బీటెక్ అభ్యర్థులకు ఈ నెల 8న రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఓరియెంటషన్ కు హాజరు కావాలని సూచించారు. అర్హత,ఆసక్తి ఉన్న అభ్యర్థులకు 11 వ తేదీ నుంచి బ్యాచ్ ప్రారంభం అవుతుందని తెలిపారు.టాస్క్ నందు శిక్షణ పొందిన అభ్యర్థులకు మంచి ప్యాకేజీలతో ఉపాధి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మిగతా వివరాలకు 9573420718, 7075522671 నంబర్లలో సంప్రదించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు.

## ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సభకు

# ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలి



**హుస్నాబాద్** సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్లో మే 10.న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సభకు బిందెవరపల్లి మండల జనసమీకరణ సన్నాహక సమావేశం బిజెపి మండల అధ్యక్షుడు శ్రీరామోజు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిలుగా రాష్ట్ర నాయకుడు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, మండల ఇంచార్జి ఖమ్మం వేంకటేశం హాజరై సభ జనసమికరణకు దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మ్యాకల స్వర్ణలత-సురేందర్ రెడ్డి, సర్పంచ్ మాచర్ల కుమారస్వామి గౌడ్, సీనియర్ నాయకులు దొంగల కొమురయ్య,గండు సారయ్య, అంబీర్ కవిత, గుండెల్లి సదానందం,దొంగల వేణు, బొజ్జపురి పృథ్వీరాజ్, ఉప సర్పంచ్ శనిగరపు ఐలయ్య,వార్డు సభ్యులు బొల్లంపల్లి శ్యామ్, పయ్యావుల రాజు, కంకర సదానందం,లక్కిరెడ్డి మల్లారెడ్డి, ములుగు సంపత్ రఘు, ప్రదీప్ రెడ్డి, కాలేరు వికాస్, సింగల్ రాజేందర్, బైకానీ అఖిల్, కాలేరు వికాస్, సాయి వంశీ, హాజరయ్యారు

# ప్రీ స్కూల్ సంసిద్ధత కార్యక్రమం



**కనిగిరి:** ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎంవిఎస్ పార్వతి ఆధ్వర్యంలో ప్రీ స్కూల్ సంసిద్ధత కార్యక్రమం బుధవారం కనిగిరి మండలం నారపురెడ్డిపల్లి అంగన్వాడి కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్వతి తల్లులను ఉద్దేశించి మాట్లాడుతూ 3 నుంచి 6సం. పిల్లలను అంగన్వాడీ కేంద్రం వాతావరణానికి అలవాటు చేసే ఒక కీలకమైన పునాది దశ అన్నారు. పిల్లల్లో సామాజిక, భావోద్వేగ, శారీరక, అభిజ్ఞా నైపుణ్యాలను ఆట పాటలతో అభివృద్ధి చేసి, వారు పాఠశాల విద్యను ఆత్మవిశ్వాసంతో ప్రారంభించేలా చేస్తుందని తెలిపారు. ప్రీ స్కూల్ ముఖ్య ఉద్దేశాలు, ప్రయోజనాలను వివరించారు. కేంద్రములో పిల్లలు కథలు, చిత్రలేఖనం, ఆట పాటలతో ప్రీస్కూల్ కృత్యాలను తల్లులకు చేసి చూపించారు. ఈ కార్యక్రమము పిల్లల సమగ్ర వికాసానికి, విద్యపై ఆసక్తిని పెంపొందించడానికి సహాయపడుతుందని, 3 నుంచి 6 సంవత్సరం పిల్లలందరినీ అంగన్వాడీ కేంద్రానికి పంపాలన్నారు. కొత్తగా 4వ సంవత్సరం వచ్చిన పిల్లలను అక్షరాభ్యాసం చేయించి స్కూల్లో చేయించినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త ఎం రమణమ్మ, గ్రామంలోని తల్లులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# దూరమైన దారులు... కానీ ఒక్కటైన మనసులు

**- కాలం దూరం చేసినా, స్నేహాన్ని విడదీయలేక పోయింది**

**- 21 ఏళ్ల అనంతరం 2004 - 05 ఎస్సెస్సీ బ్యాచ్ ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రెండు దశాబ్దాల క్రితం ఒకే తరగతి గదిలో కలిసి కూర్చొని చదువుకున్న స్నేహితులు... కాలం గడిచేకొద్దీ ఎవరి జీవితాలు వారివైపు మళ్లాయి. చదువులు, ఉద్యోగాలు, కుటుంబ బాధ్యతలతో ఎక్కడెక్కడో స్థిరపడిపోయారు. కానీ 21 ఏళ్ల క్రితం విడిపోయిన ఆ పాఠశాల మైదానం మాత్రం వారి జ్ఞాపకాలలో ఎప్పటికీ చెరిగిపోలేదు.ఆ మధుర జ్ఞాపకాలను మరోసారి సజీవం చేసుకునేందుకు రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత ప్రభుత్వ పాఠశాలలో 2004-05 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 21 ఏళ్ల తర్వాత అదే పాఠశాలలో ఘనంగా ఆత్మీయంగా బుధవారం కలుసుకున్నారు.అదే బ్యాచ్ పూర్వ విద్యార్థి కన్నం సాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూర్వ విద్యార్థుల సమ్మేళనం భావోద్వేగాలకు వేదికగా మారింది. ఎన్నో ఏళ్ల తర్వాత ఒకరినొకరు చూసుకున్న స్నేహితులు "గుర్తుపట్టావా..?" అంటూ ఆప్యాయంగా పలకరించుకున్నారు. అప్పటి చిన్ననాటి అల్లర్లు, క్లాస్‌రూం సరదాలు, గురువుల మందలింపులు, కలిసి ఆడుకున్న రోజులు ఒక్కసారిగా అందరి కళ్లముందు తిరిగాయి. కొందరి కళ్లలో ఆనందభాష్పాలు మెరిశాయి.తమ జీవిత ప్రయాణం గురించి, కుటుంబ వివరాల గురించి చెప్పుకుంటూ పాత అనుబంధాన్ని మరోసారి బలపరుచుకున్నారు. చిన్నప్పుడు తమకు అక్షర జ్ఞానం నేర్పి జీవితానికి దారి చూపిన గురువులను ప్రత్యేకంగా ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. వారికి మెమెంటోలు అందజేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ..."21 ఏళ్ల తర్వాత మళ్లీ అదే పాఠశాలలో, అదే స్నేహితులతో కలవడం జీవితంలో మర్చిపోలేని అనుభూతి. కాలం మమ్మల్ని దూరం చేసినా, మా స్నేహాన్ని మాత్రం విడదీయలేకపోయింది. ఈ రోజు మళ్లీ చిన్ననాటి రోజుల్లోకి వెళ్లిపోయినట్టుంది" అని భావోద్వేగంగా పేర్కొన్నారు.

# మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం

**- డీఎస్పీ హెచ్చరిక**

**- గంజాయి విక్రయ యత్నానికి వేములవాడ పోలీసుల చెక్ - ఇద్దరి అరెస్టు**



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయానికి ప్రయత్నించిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. చెక్కపల్లి రోడ్డులోని పెద్దమ్మ గుడి సమీపంలో ప్రత్యేక బృందం నిర్వహించిన తనిఖీల్లో నాంపెల్లి గ్రామానికి చెందిన జడల నాగరాజు (50), వడిచర్ల జాన్ ప్రతాప్ రెడ్డి (60)లను అదుపులోకి తీసుకున్నారు.వారి వద్ద నుంచి 160 గ్రాముల గంజాయి, ఒక వివో మొబైల్ ఫోన్, హీరో హెచ్‌ఎఫ్ డీలక్స్ బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని వేములవాడకు చెందిన ఓ వ్యక్తి వద్ద కొనుగోలు చేసి విక్రయించేందుకు తీసుకువచ్చినట్లు విచారణలో నిందితులు ఒప్పుకున్నారని పోలీసులు తెలిపారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ సందర్భంగా వేములవాడ డీఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ, యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు.గంజాయి విక్రయాలు లేదా వినియోగంపై సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# విద్యార్థులు ఇదే స్ఫూర్తితో ఉన్నత లక్ష్యాల దిశగా ముందుకు సాగాలి

**- జాగిర్యాల్ గ్రామ సర్పంచ్ : గడల ప్రసాద్**

**- ఎస్సెస్సీ టాపర్లకు సర్పంచ్ అభినందనలు**



భీంగల్ (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా, భీంగల్ మండలంలోని జగిర్యాల్ గ్రామంలో పదవ తరగతి ఫలితాల్లో 500కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులను బుధవారం గ్రామ సర్పంచ్ గడల ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులకు పూలమాలలు వేసి, మెమెంటోలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గడల ప్రసాద్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరచడం గ్రామానికి గర్వకారణమన్నారు. కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. విద్యార్థుల విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయ బృందం, సహకరించిన తల్లిదండ్రులను ప్రత్యేకంగా అభినందించారు. గ్రామంలోని ప్రతి విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించి మంచి స్థాయికి చేరుకునేలా గ్రామపంచాయతీ తరఫున ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజేశ్వర్, ప్రధానోపాధ్యాయురాలు కళావతి, ఉపాధ్యాయ బృందం పాల్గొని విద్యార్థుల విజయానికి కారకులైన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# రైతులు పంట మార్పిడి పద్ధతులు పాటించాలి

**- ఆయిల్ పామ్ సాగుతో స్థిరమైన ఆదాయం సాధ్యం**

**- రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం**

**- బోయినిపల్లి ఏఎంసీ చైర్మన్ : బోయిని ఎల్లేష్ యాదవ్**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా "రైతు వారం" కార్యక్రమాన్ని ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు ఇచ్చిన సందేశాన్ని చైర్మన్ ఎల్లేష్ యాదవ్ చదివి వినిపించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

రైతులు ప్రతి సంవత్సరం ఒకే రకమైన పంటలను సాగు చేయడం వల్ల భూమిలోని పోషక విలువలు తగ్గిపోతున్నాయని తెలిపారు. దీంతో పెట్టుబడులు పెరిగినా ఆశించిన దిగుబడులు రావడం లేదన్నారు.

రైతులు పంట మార్పిడి విధానాన్ని అనుసరించడంతో పాటు పప్పుధాన్యాలు, వేరుశనగ వంటి ఆరుతడి పంటలను కూడా సాగు చేయాలని సూచించారు.రాష్ట్రంలో ఆయిల్ ఫామ్ సాగుకు మంచి అవకాశాలు ఉన్నాయని, ఒకసారి సాగు ప్రారంభిస్తే దాదాపు మూడు దశాబ్దాల పాటు స్థిరమైన ఆదాయం పొందే అవకాశం ఉంటుందని వివరించారు .వరి, పత్తి వంటి సంప్రదాయ పంటలతో పోలిస్తే ఆయిల్ ఫామ్ సాగులో నష్టాలు తక్కువగా, లాభాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని, రైతులకు విత్తనాలు, ఎరువులు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రతి రైతు వినియోగించుకోవాలని కోరారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం రైతుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు పంటల సాగు చేపట్టాలని రైతులకు సూచించారు.అనంతరం గ్రామంలోని పలువురు రైతులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి, బోయినిపల్లి సర్పంచ్ నల్ల మోహన్, యూనియన్ బ్యాంక్ మేనేజర్ మహేందర్ రెడ్డి, కేడీసీసీ మేనేజర్, మార్కెట్ కార్యదర్శి రమణ, ఏఈఓ శ్రీదేవి, జిపిఓ, ఏఎంసీ డైరెక్టర్లు మెరుపుల మహేష్, అద్దంకి రమేష్,బాలగోని వెంకటేష్,అనుముల హరికృష్ణ,రోమాల అజయ్, నీరటి మహేష్,రైతులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

# నిత్యావసర ధరలను నియంత్రించాలి

**- సీపీఐ వేములవాడ నియోజకవర్గ ఇంచార్జి : కడారి రాములు**

**- కేంద్రప్రభుత్వం వైఫల్యంపై సీపీఐ విమర్శలు**



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడలో పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలపై సిపిఐ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. బుధవారం వేములవాడ బ్రిడ్జ్ వద్ద సిపిఐ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇంచార్జ్ కడారి రాములు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్, డీజిల్, పెట్రోల్, వంట నూనెతో పాటు నిత్యావసర వస్తువులు, సలాక, సిమెంట్, గృహ నిర్మాణ సామాగ్రి ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధరలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. డీజిల్, పెట్రోల్ కొరత లేదని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ కృత్రిమ కొరత సృష్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆరోపించారు. తక్షణమే ధరలను నియంత్రించి సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బండారు దేవయ్య, కోరేపు క్రాంతి, దేవదాస్, పెంట శ్రీను, గాజుల రమేష్ తదితర సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

# కులగణన కోసం ప్రభుత్వ సలహాదారు వి హెచ్ చేపట్టే ఆమరణ నిరాహార దీక్షకు సంపూర్ణ మద్దతు

**- టి జి ఎస్ రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర**



హైదరాబాద్( ప్రశ్న న్యూస్ ) రామంతాపూర్ లో తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దీటి మల్లయ్య గంగపుత్రను తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి వరంగల్ గంగపుత్ర హౌసింగ్ సొసైటీ డైరెక్టర్ టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర మర్యాదపూర్వకంగా కలిసి వరంగల్ గంగపుత్ర హౌసింగ్ సొసైటీ డైరి అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించిన అనంతరం తెలంగాణ గంగపుత్ర సంఘం టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర మాట్లాడుచూ కేంద్రం వెంటనే బి సి కులగణనను చేపట్టాలని కేంద్ర ప్రభుత్వము పై ఒత్తిడి పెంచేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు చేపట్టబోయే ఆమరణ నిరాహార దీక్షకు తెలంగాణ గంగపుత్ర సంఘం తరుపున సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ తెలంగాణ పర్యటనకు వస్తున్నా ప్రధాని నరేంద్ర మోడీ బి సి కులగణన పై అధికారిక ప్రకటన చేసి తెలంగాణలో అడుగు పెట్టాలని లేని పక్షంలో తెలంగాణ కుల సంఘాలతో కలిసి నిరసనలతో అడ్డుకుంటామని హెచ్చరించారు

# కొండపాక మండల్ టాపర్ మహమ్మద్ సుహానాకు సత్కారం



**గజ్వేల్ (ప్రశ్న న్యూస్)**సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం పరిధిలోని కొండపాక మండలంలో పదవ తరగతి ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థిని మహమ్మద్ సుహానాను ఘనంగా సత్కరించారు. సిరిసినగండ్ల గ్రామానికి చెందిన మహమ్మద్ అజీమ్ కుమార్తె సుహానా ఇటీవల ప్రకటించిన పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో మండల స్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది.ఈ సందర్భంగా గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి ఆమె నివాసానికి వెళ్లి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో ఉన్నత విద్యలు అభ్యసించి గ్రామం, మండలం, రాష్ట్రం, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అలాగే సుహానా భవిష్యత్ చదువులకు తమ వంతు సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నూనె కుమార్, నవాజ్ మీరా, హనుమంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గజ్వేల్‌లో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో పెరుగన్నం పంపిణీ



**గజ్వేల్ (ప్రశ్న న్యూస్)** సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లోని ఇందిరాపార్క్ చౌరస్తా వద్ద బుధవారం ప్రభుత్వ పాఠశాలలో 1983--84 సంవత్సరంలో చదువుకున్న పదవ తరగతి పూర్వ విద్యార్థులు పెరుగన్నం పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా తోట బిక్షపతి, దూబకుంట లక్ష్మణ్, గందె రమేష్, నర్సింలు మాట్లాడుతూ "మానవసేవే మాధవసేవ" అనే నినాదంతో సామాజిక సేవ కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని తెలిపారు. 1983--84 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు మూడు సంవత్సరాల క్రితం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి, సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేయాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు.ఆ నిర్ణయం మేరకు ప్రతి ఏడాది వేసవికాలంలో మజ్జిగ, అంబలి, పులిహోర వంటి ఆహార పదార్థాలను పంపిణీ చేస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా వేసవిలో పెరుగన్నం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని తెలిపారు.

ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ పూర్వ విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్.సీ. శ్రీనివాస్, గంగిశెట్టి సుధాకర్, ఓబుల్, జగ్గయ్యగారి శ్రీనివాస్, గుంటుకు యాదగిరి, గౌరీశెట్టి శ్రీనివాస్, ఉప్పల వెంకటయ్య, దేశపతి శంకర్ శర్మ, దూలం వెంకటయ్య, భ్రమరాంబ, రత్నమాల, కృష్ణవేణి, శోభ, శ్రీకాంత్ రెడ్డి, దీనబంధు, వెంకట్ రెడ్డి, హరినాథ్, ధర్మారెడ్డిపల్లి శ్రీనివాస్, జ్ఞానేశ్వర్, నాగరాజు, నేతి శ్రీనివాస్, వేణుగోపాల్, నర్సింలు, రేణిగుంట శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, పెద్ది శ్రీనివాస్, చేతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రాందాస్ గౌడ్, భూషణం తదితరులు పాల్గొన్నారు.

# మల్కాజ్‌గిరి సీపీ సుమతి కీలక ఆపరేషన్..

**- వేధింపులపై స్వయంగా రంగంలోకి**

**మల్కాజ్‌గిరి** మహిళల భద్రతపై కట్టుదిట్టమైన చర్యల భాగంగా మల్కాజ్‌గిరి సీపీ సుమతి స్వయంగా రంగంలోకి దిగిన సంఘటన సంచలనంగా మారింది. మంగళవారం అర్ధరాత్రి సమయంలో సీపీగా కాకుండా సాధారణ మహిళగా బస్టాండ్‌లో నిలబడి పరిస్థితులను పరిశీలించారు.ఈ సందర్భంగా సాధారణ మహిళలకు ఎదురయ్యే వేధింపులను ప్రత్యక్షంగా అనుభవించిన సీపీ సుమతి, అక్కడ ఉన్న కొంతమంది పోకిరీల ప్రవర్తనను గమనించారు. సమాచారం ప్రకారం, దాదాపు 40 మంది వరకు ఆమెను చుట్టుముట్టి అసభ్యంగా ప్రవర్తించినట్లు గుర్తించారు. తక్షణమే అప్రమత్తమైన పోలీసులు రంగంలోకి దిగడంతో వారందరినీ అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు కౌన్సెలింగ్ కూడా నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.ఈ ఆపరేషన్ ద్వారా మహిళల భద్రతపై పోలీసుల కట్టుదిట్టమైన వైఖరి స్పష్టమవుతుందని, ఇటువంటి వేధింపులకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

# పంటపైనే రైతు మృతి



**కరీంనగర్** ప్రభుత్వం వడ్లు కొనకపోవడంతో గుండెపోటుతో గుర్రై మరో రైతు మృతి చెందాడు. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం గద్దపాక గ్రామంలో వడ్లను కుప్పలుగా పోస్తూ రైతు ఐలయ్య గుండెపోటుతో గుర్రై మృతి చెందాడు. మంగళవారం సాయంత్రం మబ్బులు కమ్ముడంతో వర్షం పడేలా ఉందని వడ్లను కుప్పపోస్తూ, పంటపైనే కుప్పకూలిపోయాడు. ప్రభుత్వం సకాలంలో పంటను కొనుగోలు చేసుంటే ఐలయ్య బ్రతికేవాడని గ్రామస్థుల ఆవేదన.

# ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

- బోయినిపల్లి ఏఎంసీ చైర్మన్ : బోయిని ఎల్లేష్ యాదవ్

- ధాన్యం కొనుగోళ్లపై అధికారులతో ఏఎంసీ చైర్మన్ సమావేశం



బోయినిపల్లి / సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండల రైతులు పండించిన ధాన్యాన్ని ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనుగోలు చేయాలని బోయినిపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్ అధికారులను కోరారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు బుధవారం సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా సివిల్ సప్లై అధికారి బుచ్చిబాబు, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ నరసింహ, ట్రాన్స్‌పోర్ట్ ఇంచార్జీలను కలిసి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బోయిని ఎల్లేష్ యాదవ్ మాట్లాడుతూ మండలంలోని కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకువస్తున్న ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా రైస్ మిల్లులకు తరలించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ధాన్యం నిల్వలు పేరుకుపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా రవాణా సమస్యలు తలెత్తకుండా మండలానికి అవసరమైన మేర ట్రాన్స్‌పోర్ట్ లారీలను అందుబాటులో ఉంచాలని అధికారులను కోరారు. రైతులు రోజులు తరబడి కొనుగోలు కేంద్రాల వద్ద వేచి ఉండకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం రైతు పక్షపాతిగా వ్యవహరిస్తోందని, రైతుల ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఏఎంసీ వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొప్పుల నగేష్ పాల్గొన్నారు.

## ఆటో దొంగతనం కేసులో ముగ్గురు అరెస్ట్, రిమాండ్ కు తరలింపు: ఎస్ఐ కే. రాహుల్ రెడ్డి




ఎల్లారెడ్డిపేట (ప్రశ్న న్యూస్) ఆటో దొంగతనం కేసులో ముగ్గురు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. వివరాల్లోకి వెళితే తేదీ 19-04-2026 రోజున మధ్యాహ్నం 3:00 సమయంలో ఎల్లారెడ్డిపేటలోని శ్రీ సాయి ట్రేడర్స్ దగ్గరలో గల ఖాళీ స్థలంలో దుబ్బ శ్రీనివాస్ అను అతను తన రెండు ట్రాలీ ఆటోలను పార్కింగ్ చేసి ఉండగా మంద ప్రశాంత్, శివరాత్రి మహేందర్, మానుక బాలకిషన్ అను ముగ్గురు పార్కింగ్ చేసిన రెండు ట్రాలీ ఆటోలలో ఒక ట్రాలీ ఆటో యొక్క అద్దం పగలగొట్టి ఆటోను దొంగతనంగా ఎత్తుకెళ్లడానికి ప్రయత్నించగ అక్కడున్న వారిని చూసి పారిపోయినారని ఇచ్చిన దరఖాస్తుపై ఎస్సై కే రాహుల్ రెడ్డి కేసు నమోదు చేసినారు. గతంలో మంద ప్రశాంతపై అయిదు(05) కేసులలో నిందితుడిగా ఉండి జైలు కి కూడా వెళ్లి వచ్చినాడు. ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా వారికి 14 రోజుల జ్యూడిషియల్ రిమాండ్కు తరలించారు.

## రెండు ఆలయాలకు నిధులు మంజూరుకు ఆమోదం



ఎల్లారెడ్డిపేట( ప్రశ్న న్యూస్) మండల కేంద్రంలోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం, సిరిసిల్లలోని శ్రీ వెంకటేశ్వర ఆలయానికి టీటీడీ బోర్డు మీటింగ్ లో టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడు నిధులను మంజూరు చేయడానికి ఆమోదం తెలుపుతున్నట్లు స్పష్టంగా వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దోమ్మాటి నర్సయ్య జిల్లా ఉపాధ్యక్షులు షేక్ గౌస్ బాయ్ స్థానిక కాంగ్రెస్ పార్టీ నారకులు శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ కమిటీ మాజీ అధ్యక్షులు నందికిషన్ గడ్డం జితేందర్ తెలంగాణ దేవదాయశాఖ మంత్రి కొండ సురేఖ ప్రభుత్వ విఫ్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ సిరిసిల్ల శాసనసభ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి ల ద్వారా టిటిడి దేవస్థానం చైర్మన్ బిఆర్ నాయుడును పలుసార్లు కలిసి ఎల్లారెడ్డి పేట శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ నిర్మాణం, సిరిసిల్ల శ్రీ వెంకటేశ్వర్ల స్వామి ఆలయ నిర్మాణం కోసం నిధుల మంజూరు కోసం విశ్వ ప్రయత్నాలు చేయగా టీటీడీ బోర్డు మీటింగ్ లో టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడు నిధులను మంజూరుకు ఆమోదం తెలిపారు, కాగా నిన్న ఎల్లారెడ్డిపేట నుండి బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య ఆధ్వర్యంలో ఆలయ కమిటీ కేటీఆర్ ను కలిసి మాట్లాడగా స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో పాటు ఆలయకమిటి మాజీ అద్దక్షులు నంది కిషన్ గడ్డం జితేందర్, గంట వెంకటేష్ గౌడ్ లు ఉప ముఖ్య మంత్రి బట్టి విక్రమార్క తో మాట్లాడారు. ఇవాళ బోర్డు మీటింగ్లో ఈ రెండు ఆలయాలను నిర్మించేందుకు ఆమోదం తెలుపుతున్నట్లు ప్రకటించిన సందర్భంగా ఎల్లారెడ్డిపేట ఆలయ కమిటీ, భక్తులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

# అయోమయంలో ప్రభుత్వం, అట్టడుగున ఆర్థిక వ్యవస్థ: ఈటెల



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బోయిన్ పల్లి కూరగాయల మార్కెట్ లో రైతు ఉత్సవాలు నిర్వహించారు.బోయిన్ పల్లి మార్కెట్ చైర్మన్ ఆనంద్ బాబు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ హాజరయ్యారు.ఈ కార్యక్రమానికి బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ,కమిషన్ ఏజెంట్లు,రైతులు,హమాలీలు తదితరులు పాల్గొన్నారు.

### ఈటెల మాటలు, నమ్మకం కోల్పోతున్న కాంగ్రెస్ ప్రభుత్వం..

డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ యార్డు, బోయిన్ పల్లి వ్యవసాయ ఉత్పత్తుల వాణిజ్యంలో కీలక పాత్ర పోషిస్తున్న విషయం విదితమే.ఆయన ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రైతు వారోత్సవాలు నిర్వహిస్తున్నప్పటికీ బోయిన్ పల్లి మార్కెట్ సమస్యల వలయంగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు.గత కొంత కాలంగా మార్కెట్ పరిసరాలలో పరిశుభ్రత లోపించి గుట్టలు గుట్టలుగా చెత్త పేరుకుపోవడం, మరుగుదొడ్ల నిర్వహణ లేకపోవడం,రైతులు హమాలీలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న నేపథ్యంలో తాను గతంలో మూడు గంటల పాటు ధర్నా చేపట్టినట్లు గుర్తు చేశారు. రైతుల సమస్యల పై త్వరితగతన స్పందించి తుమ్మల నాగేశ్వరరావుకు తాను లేఖ రాసినట్లు ప్రభుత్వం నుండి కాంట్రాక్టర్లకు రావాల్సిన బిల్లులు సకాలంలో రాకపోవడం శోచనీయమని అన్నారు. ఆర్థిక శాఖ నుండి వెంటనే పెండింగ్ లో ఉన్న బిల్లులను చెల్లించే విధంగా ప్రభుత్వం సమీక్ష చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు.సమస్యలపై పలుమార్లు విజ్ఞప్తులు చేసినప్పటికీ ప్రభుత్వం నుండి స్పందన రాకపోతే ప్రభుత్వాలకే ప్రమాదం అని అన్నారు.ఇప్పటికైనా సంబంధిత మంత్రి మార్కెట్లో నెలకొన్న సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులదే.డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ యార్డు,బోయిన్ పల్లి వ్యవసాయ ఉత్పత్తుల వాణిజ్యంలో కీలక పాత్ర పోషిస్తున్న విషయం విదితమే.అలాగే ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రైతు వారోత్సవాలు నిర్వహిస్తున్నప్పటికీ బోయిన్ పల్లి మార్కెట్ సమస్యల వలయంగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు.గత కొంత కాలంగా మార్కెట్ పరిసరాలలో పరిశుభ్రత లోపించి గుట్టలు గుట్టలుగా చెత్త పేరుకుపోవడం, మరుగుదొడ్ల నిర్వహణ లేకపోవడం,రైతులు హమాలీలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న నేపథ్యంలో తాను గతంలో మూడు గంటల పాటు ధర్నా చేపట్టినట్లు గుర్తు చేశారు. రైతుల సమస్యల పై త్వరితగతన స్పందించి తుమ్మల నాగేశ్వరరావుకు తాను లేఖ రాసినట్లు ప్రభుత్వం నుండి కాంట్రాక్టర్లకు రావాల్సిన బిల్లులు సకాలంలో రాకపోవడం శోచనీయమని అన్నారు. ఆర్థిక శాఖ నుండి వెంటనే పెండింగ్ లో ఉన్న బిల్లులను చెల్లించే విధంగా ప్రభుత్వం సమీక్ష చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు.సమస్యలపై పలుమార్లు విజ్ఞప్తులు చేసినప్పటికీ ప్రభుత్వం నుండి స్పందన రాకపోతే ప్రభుత్వాలకే ప్రమాదం అని అన్నారు.ఇప్పటికైనా సంబంధిత మంత్రి మార్కెట్లో నెలకొన్న సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాల్సిన బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ పరంగా జరిగే కార్యక్రమాలు జరగనిచ్చినప్పుడే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్ళొచ్చు. అధికారులు ప్రజల దగ్గరికి వెళ్లినప్పుడే సమస్యలు వేగవంతంగా పరిష్కారమవుతాయి.మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి కూడా తీసుకెళ్ళాను. పది కోట్లు ఇవ్వమని అడిగాము.ఇది ఆసియాలోనే అతిపెద్ద మార్కెట్.ఈ మార్కెట్లో పనిచేసేవారిని, రైతులను సంతోషంగా ఉండేలా చూడాలని కొరుతున్నా.పండించిన పంట కళ్ళముందే మట్టిపాలు, బురదపాలు అవుతున్నప్పుడు ఆ బాధ కేవలం ఆ అన్నదాతకే తెలుసు. కాంటాలలో,ధరలో మోసం లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదే.హమలీల సమస్యలను కూడా పట్టించుకోండి.దోమల నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. రాత్రి సమయంలో రైతులు, హామాలీలు ఉండడానికి మరుగు దొడ్లు, నీటి సరఫరా తదితర విషయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాలకులు వస్తారు పోతారు కానీ ఇక్కడ ఉండేది హామలీలు, రైతులు, కమీషన్ ఏజెంట్లు మాత్రమే. కూరగాయలు కొనుగోలు చేసే ఖరీదు దారులు ముక్కు మూసుకొని వచ్చే పరిస్థితి లేకుండా చూడండి.ఈ మార్కెట్ మనందరిది అనే భావన కలిగేలా వ్యవహరించాలన్నారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ రాగిరి ఆనంద్ బాబు,సెక్రటరీ ఈ. వెంకటేశం, భాజపా సీనియర్ నాయకులు భానుక మల్లికార్జున, సికింద్రాబాద్ వెజిటబుల్ కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్ అధ్యక్షుడు సోమ దేవేందర్ రెడ్డి, కార్యదర్శి చంద్రారెడ్డి వైస్ ప్రెసిడెంట్ మిర్యాల శ్రీనివాస్, కమిటీ సభ్యులు ప్రభాకర్, రాము,అస్లాం,ఆకాష్ రెడ్డి తదితరులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పాల్గొన్నారు.

### అసోసియేషన్ అధ్యక్షుడు సోమ ఆవేదన..


డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో నిన్న బుధవారం ఉదయం "రైతు వారోత్సవాలు" కార్యక్రమంలో సికింద్రాబాద్ వెజిటబుల్ కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్ అధ్యక్షుడు సోమ దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు.ఆయన మాట్లాడుతూ మార్కెట్ లో గత కొంతకాలంగా మౌళిక సమస్యలు తాండవం ఆడుతున్నాయని, సర్కారు నిర్లక్ష్యానికి కమీషన్ ఏజెంట్ల బలి అవుతున్నారు.మరీ ముఖ్యంగా మార్కెట్ లో రైతులు,ఖరీదుదారులు, కమీషన్ ఏజెంట్లు,హామాలీలు నిత్యం సమస్యలతో పోరాటం చేస్తున్నారని సోమ ఆవేదన వ్యక్తంచేశారు. వీలైనంత త్వరగా అందరు మార్కెట్ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో బోయిన్ పల్లి మార్కెట్ యార్డు ఇన్చార్జ్ జె.సత్యనారాయణ, గ్రేడ్ వన్ అధికారి మధులిక, గ్రేడ్ త్రీ మహ్మద్ కాజా, మేడ్చల్ శ్రీనివాస్, ఖలీద్, సాయి, మధు, ఫిలిప్స్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎంను కలిసిన టిడిపి జిల్లా అధ్యక్షులు,

- ఎమ్మెల్యే బడేటి చంటి

-జిల్లా పార్టీకి సంబంధించి పలు అంశాలపై చర్చ.

-ఏలూరు అభివృద్ధి పనులకు గ్రాంట్ కొరకు వినతి.



అమరావతి (ప్రశ్న న్యూస్) తెలుగుదేశం పార్టీకి ఎప్పుడూ కంచుకోటగా నిలిచే ఏలూరు జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటూ అన్నివర్గాల ప్రజల అవసరాలను తీర్చేందుకు ప్రజాప్రతినిధులందరూ సమిష్టిగా కృషిచేస్తున్నామని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వివరించారు. బుధవారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబును టిడిపి జిల్లా అధ్యక్షులు బడేటి చంటి కలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీ పరిస్థితి, రోజురోజుకూ పెరుగుతున్న ప్రజాదరణ, సూపర్ సిక్స్ పథకాల పట్ల ప్రజలు చూపుతున్న ఆదరణ తదితర అంశాలను సిఎం దృష్టికి ఆయన తీసుకువెళ్ళారు. అలాగే పేద ప్రజలకు గతంలో ఎన్నడూలేని విధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి ఆసరాగా నిలుస్తోందని, జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఈ రెండేళ్ళ కాలంలో కోట్లాది రూపాయలు సీఎం రిలీఫ్ ఫండ్ కింద బాధితులకు అందజేయడం జరిగిందని, ప్రతి నియోజకవర్గంలోనూ దీనిపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయని జిల్లా పార్టీ అధ్యక్షులు చంటి వివరించారు. అలాగే ఈ సందర్భంగా ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో సీఎం రిలీఫ్ ఫండ్‌కు సంబంధించి ప్రతిపాదనలు ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేశారు. అలాగే నియోజకవర్గ పరిధిలో భవిష్యత్తులో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ఆయనకు వివరించి వాటికి నిధులు మంజూరు చేయాలని కోరారు. అభివృద్ధికి దిక్సూచిగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, జరుగుతున్న అభివృద్ధిని, చేపడుతున్న సంక్షేమాన్ని ప్రజలకు వివరించి వారికి భవిష్యత్తుపై భరోసా కల్పించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా పార్టీ అధ్యక్షులు బడేటి చంటికి సూచించారు.

## ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తా

- చందుర్తి నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్ : కట్ల రవీందర్

- చందుర్తి సీఐగా కట్ల రవీందర్ బాధ్యతల స్వీకరణ



చందుర్తి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,చందుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కట్ల రవీందర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు చందుర్తి సీఐగా పనిచేసిన జి. వెంకటేశ్వర్లు డీఎస్పీగా పదోన్నతి పొంది బదిలీ కావడంతో, ఆయన స్థానంలో కట్ల రవీందర్ నియమితులయ్యారు.బుధవారం చందుర్తి సర్కిల్ కార్యాలయంలో ఆయన అధికారికంగా బాధ్యతలు చేపట్టగా, పోలీస్ అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు మెరుగైన పోలీసింగ్ అందించేందుకు కట్టుబడి పనిచేస్తానని ఈ సందర్భంగా సీఐ రవీందర్ పేర్కొన్నారు.

## రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా రైతు వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, రైతుల అభివృద్ధి మరియు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రైతులు పండించిన పంటలకు న్యాయమైన ధరలు అందేలా మార్కెట్ యార్డులో అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. మార్కెట్ యార్డులో తూకం సౌకర్యాలు, గోదాములు, తాగునీరు, మరుగుదొడ్లు, విశ్రాంతి ప్రదేశాలు వంటి మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. రైతులు తమ పంటలను నేరుగా మార్కెట్‌కు తీసుకువచ్చి మధ్యవర్తుల మోసాలకు గురికాకుండా జాగ్రత్త పడాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ, వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రైతు వారోత్సవాల ద్వారా మార్కెట్ విధానాలు, ధరలు వంటి అంశాలపై అవగాహన పెంచి రైతుల ఆదాయం పెంపుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, సెక్రటరీ జాన్ వెస్లీ, సభ్యులు, అధికారులు, స్థానిక నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సత్యం సహకారంతో అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు అందేలా కృషి

- విలాసాగర్ సర్పంచ్ : ఏనుగుల కనుకయ్య

- లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేత - సన్మానం - శుభాకాంక్షలు



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, విలాసాగర్ గ్రామంలో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఏనుగుల కనకయ్య లబ్ధిదారులు సుంకపాక రేణుక - నర్సయ్య దంపతులను నూతన వస్త్రాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ కనకయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం పేద కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా మారిందన్నారు. చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం సహకారంతో అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి సొంతింటి కల నెరవేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. గ్రామ అభివృద్ధితో పాటు పేద ప్రజల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మిడిదొడ్డి శ్రీనివాస్, లబ్ధిదారు కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' మూవీ రివ్యూ!



ప్రదీప్ రంగనాథన్ కి యూత్ లో మంచి క్రేజ్ ఉంది. ఆయన ఎంచుకునే కథలు .. పాత్రలే అందుకు కారణమని చెప్పాలి. ఇంతకుముందు ఆయన చేసిన సినిమాలు 100 కోట్ల మార్కును టచ్ చేయడంతో, సహజంగానే ఆయన తదుపరి సినిమాల పట్ల ప్రేక్షకులకు అంచనాలు పెరిగిపోతూ వచ్చాయి. అలా ఆయన చేసిన సినిమానే 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ'(రా×ఖ) ఏప్రిల్ 10వ తేదీన థియేటర్లకు వచ్చిన ఈ సినిమా, ఈ రోజు (మే 6వ తేదీ) నుంచి 'అమెజాన్ ప్రైమ్' లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ కథ 2040లో మొదలవుతుంది. యువత ఎప్పుడూ ప్రేమ వెనుక పరుగులు తీస్తూనే ఉంటుంది. అలాంటి యువత బలహీనతను ఆసరాగా చేసుకుని, సూర్య (ఎస్ జె సూర్య) లవ్ ఇన్సూరెన్స్ కంపెనీని నెలకొల్పుతాడు. యువతీ యువకులకు తన యాప్ ద్వారా ప్రేమించుకుని .. పెళ్లి చేసుకునే ఒక అవకాశాన్ని కల్పిస్తాడు. ఆ యాప్ ను సబ్ స్క్రైబ్ చేసుకుని, తమకి కావలసిన జోడీని సెట్ చేసుకోవచ్చు. పెళ్లి చేసుకోవాలంటే 'లవ్ స్కోర్' ఎక్కువగా ఉండాలి. అది లేకపోతే బ్రేకప్ చెప్పుకోవచ్చు. అలాంటి ఒక యాప్ ను 'దీమా' (కృతి శెట్టి) సబ్ స్క్రైబ్ చేసుకుంటుంది. తనకి తగిన జోడీ కోసం ఆమె సెర్చ్ చేస్తూ ఉంటుంది. అనుకోకుండా ఆమెను చూసిన వాసు ( ప్రదీప్ రంగనాథన్) మనసు పారేసుకుంటాడు. 'దీమా'కి చేరువ కావాలంటే తాను ఫోన్ వాడాలి .. సబ్ స్క్రైబర్ కావాలి. కానీ అందుకు అతని తండ్రి ఒప్పుకోడు. మొబైల్ వాడటానికి అతను పూర్తి వ్యతిరేకి. అందుకు ఒక బలమైన కారణం కూడా ఉంటుంది. అయినా తండ్రికి తెలియకుండా అతను ఫోన్ తీసుకుని, దీమాకి టచ్ లోకి వెళతాడు. అలా దీమా .. వాసు మధ్య పరిచయం మొదలై ప్రేమగా మారుతుంది. ఒకానొక సందర్భంలో వాళ్లు తమ లవ్ స్కోర్ చెక్ చేసుకుంటారు. లవ్ స్కోర్ చాలా తక్కువగా ఉండటంతో, వాసూకి దీమా బ్రేకప్ చెబుతుంది. తన ప్రేమలో లోపం లేదనీ, ఆ యాప్ లోనే లోపం ఉందని వాసు భావిస్తాడు. ఆ విషయాన్ని నిరూపిస్తానని సూర్యతో ఛాలెంజ్ చేస్తాడు. ఆ ప్రయత్నంలో అతనికి ఎలాంటి సవాళ్లు ఎదురవుతాయి? అనేదే కథ. ఇప్పటికే లెక్కలేనన్ని యాప్ లు స్మార్ట్ ఫోన్ లను వెతుక్కుంటూ వస్తున్నాయి. స్మార్టు ఫోన్ ఉంటే చాలు అన్ని రకాల వ్యవహారాలు అందుబాటులో ఉన్నట్టే. అలా ఇద్దరు వ్యక్తుల మధ్య గల ప్రేమను కొలిచే యాప్ కూడా 2040 కాలం నాటికి రావచ్చనీ .. అలాంటి ఒక యాప్ వస్తే ఎలా ఉంటుందనే ఊహకు దృశ్య రూపమే ఈ సినిమా. 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' పేరుతో దర్శకుడు ఈ కథను తయారు చేసుకున్నాడు. ఒకప్పటి ప్రేమలు వేరు .. అప్పటి పరిస్థితులు వేరు. కాలం మారిపోయింది .. మనుషులు మారిపోయారు .. ప్రేమకు అర్థాలు – నిర్వచనాలు మారిపోయాయి. ఇప్పటికే విడిపోవడం .. మరిచిపోవడం అనేవి చాలా వేగంగా జరుగుతూ వస్తున్నాయి. 2040 నాటికి యూత్ లైఫ్ స్టైల్ ఎలా ఉంటుంది? ప్రేమికుల ధోరణి ఎలా ఉంటుంది? ప్రేమలు ఎలా ఉంటాయి? అనే ఒక అంశం చుట్టూ ఈ కథ తిరుగుతుంది. హీరో తన తండ్రికి ఇచ్చిన మాటను పక్కన పెట్టేసి యాప్ వైపు రావడం .. ప్రేమను యాప్ ఎప్పుడూ కొలవలేదని నిరూపిస్తానని విలన్ తో ఛాలెంజ్ చేయడంతో, సెకండాఫ్ పై అందరిలో అంచనాలు పెరుగుతాయి. అయితే తాను అనుకున్నది సాధించడానికి హీరో అనుసరించే మార్గం అంత ఆసక్తికరంగా అనిపించదు. అతను చేసే ప్రయత్నాలు కుతూహలాన్ని రేకెత్తించవు. ఒక చిన్న ఫ్లాష్ బ్యాక్ .. అందుకు సంబంధించిన ఎమోషన్ తప్ప, ఈ కథలో కదిలించే అంశాలేవీ లేవు. ఫస్టాఫ్ లోని కామెడీయే అంతంత మాత్రంగా ఉందనుకుంటే, సెకండాఫ్ లో కామెడీ మరింత బలహీనపడుతుంది. ప్రేమకథలకు ఫీల్ గుడ్ సాంగ్స్ ప్రాణమని చెబుతుంటారు. కానీ 2040 నాటికి పాటలు ఇలాగే అర్థం లేకుండా .. అర్థం కాకుండా ఉంటాయనుకున్నారేమో అలాగే కొనసాగుతూ వెళతాయి. కృతి శెట్టి నటన విషయం పక్కన పెడితే, అంతకుముందు సినిమాలలో మాదిరిగా ఆమెను అందంగా చూపించలేకపోయారు.

ప్రదీప్ .. ఎస్ జె సూర్య నటన ఓకే. ఫొటోగ్రఫీ ఫరవాలేదు. బాణీలు పెద్దగా ఆకట్టుకోలేదు. నేపథ్య సంగీతం .. ఎడిటింగ్ ఓ మాదిరిగా అనిపిస్తాయి. మనసులోని ప్రేమ గాఢతను కొలిచే ఒక యాప్ వస్తే ఎలా ఉంటుంది? అనే విఘ్నేశ్ శివన్ ఆలోచన బాగానే అనిపిస్తుందిగానీ, ఆ ఆలోచనకు దృశ్య రూపాన్ని ఇవ్వడంలో ఆయన పూర్తిస్థాయిలో సక్సెస్ కాలేకపోయారని చెప్పాలి. ఒకే పాయింట్ చుట్టూ తిరుగుతూ ఈ కథ ప్రేక్షకుల సహనానికి పరీక్షపెడుతుంది.

# జాన్వీ కపూర్ పెళ్లి వార్తలపై తండ్రి బోనీ కపూర్ స్పందన



ప్రముఖ బాలీవుడ్ నటి జాన్వీ కపూర్, వ్యాపారవేత్త శిఖర్ పహారియాల పెళ్లిపై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారానికి నిర్మాత బోనీ కపూర్ తెరదించారు. జాన్వీ ప్రస్తుతం పెళ్లి చేసుకునే ఉద్దేశంలో లేదని, వస్తున్న వార్తలన్నీ పుకార్లేనని ఆయన తేల్చి చెప్పారు. వీరిద్దరూ గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో లేదా తిరుమల శ్రీవారి సన్నిధిలో వివాహం చేసుకోబోతున్నారంటూ కొంత కాలంగా నెట్టింట పెద్ద ఎత్తున వార్తలు హల్చల్ చేస్తున్నాయి. ఈ తరుణంలో బోనీ కపూర్ ఇచ్చిన క్లారిటీతో ఈ పుకార్లకు ప్రస్తుతానికి బ్రేక్ పడినట్లయింది.వ్యక్తిగత విషయాలను పక్కన పెడితే, జాన్వీ కపూర్ తన కెరీర్‌లో అత్యంత కీలక దశలో ఉన్నారు. ముఖ్యంగా టాలీవుడ్‌లో వరుస ప్రాజెక్టులతో ఆమె బిజీగా గడుపుతున్నారు. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ సరసన ఆమె నటిస్తున్న భారీ చిత్రం 'పెద్ది'పై సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా 2026 జూన్ నెలలో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. శిఖర్ పహారియాతో తనకున్న బంధం గురించి గతంలో మాట్లాడిన జాన్వీ, అతని ఉనికి తనకు ఎంతో ధైర్యాన్ని మరియు భద్రతను ఇస్తుందని ఎమోషనల్ అయ్యారు. ప్రస్తుతం ఆమె తన పూర్తి దృష్టిని సినిమాలపైనే కేంద్రీకరించినట్లు ఆమె తండ్రి మాటలను బట్టి అర్థమవుతోంది.



## వైరల్ అవుతున్న త్రిష పోస్ట్

నటి త్రిష పుట్టినరోజు వేడుకలు, ఆమె తాజా సోషల్ మీడియా పోస్టులు ప్రస్తుతం నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. సోమవారం తన పుట్టినరోజును పురస్కరించుకుని అభిమానులు, సినీ ప్రముఖులు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలపడంపై త్రిష తాజాగా స్పందించారు. తనపై చూపిస్తున్న అపారమైన ప్రేమకు ధన్యవాదాలు తెలుపుతూ, ఇంతటి ఆదరణ పొందినందుకు ఎంతో సంతోషంగా ఉన్నానని ఆమె తన ఇన్‌స్టా స్టోరీలో ఒక ప్రత్యేక నోట్‌ను పంచుకున్నారు. తిరుమల తనకు అత్యంత ఇష్టమైన ప్రదేశమని ఆమె పేర్కొన్నారు. త్రిష షేర్ చేసిన తిరుమల వీడియోలు వైరల్ అవుతున్నాయి.
మరోవైపు, త్రిష పుట్టినరోజు సందర్భంగా పలువురు సెలబ్రిటీలు చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. నటి రాధిక, వరలక్ష్మి శరత్‌కుమార్, ఛార్మి, మంచు లక్ష్మి వంటి వారు ఆమెకు విషెస్ తెలుపుతూ, ఈ ఏడాది పుట్టినరోజు ఆమెకు ఒక అద్భుతమైన కానుకను ఇచ్చిందని, ఇది ఆమె జీవితంలో చిరస్థాయిలో నిలిచిపోతుందని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యల వెనుక రెండు రోజుల క్రితం వెలువడిన తమిళనాడు ఎన్నికల ఫలితాల ప్రభావం కూడా ఉంది. విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ 108 స్థానాలను కైవసం చేసుకుని ప్రభంజనం సృష్టించిన నేపథ్యంలో, త్రిషకు ఈ పుట్టినరోజు అత్యంత ప్రత్యేకంగా నిలిచిందనే చర్చ నడుస్తోంది. విజయ్ ప్రభుత్వంలో త్రిష కీలక పాత్ర పోషించబోతోందనే చర్చ జరుగుతోంది.



## ప్రేక్షకులకు అబద్ధం చెప్పకూడదు: 'అగ్లీ స్టోరీ'పై అవికా గోర్

'చిన్నారి పెళ్లికూతురు', 'ససురాల్ సిమర్ కా' వంటి సీరియల్స్‌తో దేశవ్యాప్తంగా గుర్తింపు పొంది, ఉయ్యాల జంపాల వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన నటి.. అవికా గోర్. ఆమె ప్రధాన పాత్రలో నటించిన తాజా తెలుగు చిత్రం 'అగ్లీ స్టోరీ'. తాజాగా ఈ చిత్రం గురించి అవికా ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఈ సినిమా విషపూరిత (టాక్సిక్) ప్రేమకథలను గ్లామర్‌గా చూపించబోదని, వాటి వాస్తవ పరిణామాలను మాత్రమే ఆవిష్కరిస్తుందని ఆమె స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అవికా గోర్ మాట్లాడుతూ, "టాక్సిక్ బంధాలను ఆకర్షణీయంగా చూపించే ఉద్దేశం మాకు లేదు. అలాంటి సంబంధాలు ఒక వ్యక్తిపై ఎలాంటి ప్రభావం చూపుతాయో వాస్తవికంగా చూపించాలనుకున్నాం. అందుకే దానివల్ల కలిగే అసౌకర్యం, గందరగోళం, భావోద్వేగ నష్టం వంటి పర్యవసానాలపైనే దృష్టి సారించాం. పైకి అది అభిరుచిలా కనిపించినా, అది ఆరోగ్యకరం కాదనే సత్యాన్ని మా కథ చెబుతుంది" అని వివరించారు. కథ చెప్పడంలో ప్రేక్షకులకు నిజాయతీగా ఉండటమే నటిగా తన బాధ్యత అని ఆమె అన్నారు. "ప్రేక్షకులకు అబద్ధం చెప్పకూడదు. ఈ కథ ఆ పని చేయదని నేను నమ్ముతున్నాను" అని అవికా తెలిపారు. ప్రణవ్ స్వరూప్ రచన, దర్శకత్వంలో తెరకెక్కిన ఈ రొమాంటిక్ థ్రిల్లర్ మే 22న ప్రేక్షకుల ముందుకు రానుంది. రియా జియా ప్రొడక్షన్స్ పతాకంపై సిహెచ్ సుభాషిణి, కొండా లక్ష్మణ్ నిర్మించిన ఈ చిత్రంలో రవితేజ మహాదాస్యం, శివాజీ రాజా, ప్రజ్ఞా నయన్ కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రానికి శ్రవణ్ భరద్వాజ్ సంగీతం అందించగా, శ్రీ సాయి కుమార్ దార సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తించారు.

# 'ఎల్లమ్మ'లో హీరోయిన్ ఫిక్స్ ..

### మృణాల్ ఠాకూర్ ఎంట్రీతో వేణు యెల్దండి రెండో సినిమాపై పెరుగుతున్న అంచనాలు



'బలగం' వంటి హృదయాన్ని తాకే ఫ్యామిలీ ఎమోషనల్ చిత్రంతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన దర్శకుడు వేణు యెల్దండి తన రెండో సినిమాతో మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. 'ఎల్లమ్మ' అనే ప్రత్యేకమైన టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రం ప్రస్తుతం టాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా హీరోయిన్ ఎంపికపై సాగుతున్న ఉత్కంఠకు ఇప్పుడు తెరపడుతున్నట్లు సమాచారం.తెలంగాణ గ్రామీణ నేపథ్యంతో రూపొందుతున్న ఈ సినిమాలో నటనకు అత్యంత ప్రాధాన్యం ఉన్న పాత్ర కోసం దర్శకుడు చాలా జాగ్రత్తగా హీరోయిన్‌ను ఎంపిక చేయాలని భావించారు.తెలంగాణ వార్తలుప్రారంభంలో ఈ పాత్ర కోసం సాయి పల్లవిను సంప్రదించినట్లు వార్తలు వచ్చాయి. అయితే డేట్స్ సమస్యల కారణంగా ఆమె ఈ ప్రాజెక్ట్ నుండి తప్పుకున్నట్లు తెలుస్తోంది. ఆ తరువాత కీర్తి సురేష్ పేరు బలంగా వినిపించింది. ఒక దశలో ఆమె ఎంపిక దాదాపు ఖాయమని కూడా ప్రచారం జరిగింది. వీరితో పాటు శృతి హాసన్, భాగ్యశ్రీ బోర్సే, కన్నడ నటి రుక్మిణి వసంత్ పేర్లు కూడా పరిశీలనలోకి వచ్చాయి.అయితే తాజా సమాచారం ప్రకారం 'సీతా రామం' ఫేమ్ మృణాల్ ఠాకూర్ ఈ పాత్రకు దాదాపు ఫైనల్ అయినట్లు ఫిల్మ్ నగర్ వర్గాలు చెబుతున్నాయి. భావోద్వేగ సన్నివేశాల్లో తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకునే మృణాల్ ఈ సినిమాకు పెద్ద ప్లస్ అవుతుందని చిత్రబృందం భావిస్తోంది.ఇక ఈ చిత్రంలో మరో ఆసక్తికర అంశం ఏమిటంటే, ఫేమస్ సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ ఈ సినిమాతో హీరోగా పరిచయం అవుతున్నారు. 'పార్శి' అనే శక్తివంతమైన పాత్రలో ఆయన కనిపించనున్నారు. ఇటీవల విడుదలైన గ్లింప్స్‌లో ఆయన లుక్‌కు మంచి స్పందన వచ్చింది. అంతేకాదు, ఈ చిత్రానికి సంగీతాన్ని కూడా ఆయనే అందిస్తున్నారు. 'ఎల్లమ్మ' సినిమా తెలంగాణ సంప్రదాయాలు, జానపద కళలు, ఆధ్యాత్మిక అంశాలతో ముడిపడిన కథగా రూపొందుతోంది. గ్లింప్స్‌లో చూపించిన వేప ఆకులు, పసుపు, కుంకుమ, గజ్జెల శబ్దాలు సినిమాపై ఆసక్తిని మరింత పెంచాయి. ఈ చిత్రాన్ని దిల్ రాజు, శిరీష్‌లు శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. హీరోయిన్ ఎంపికపై అధికారిక ప్రకటన వెలువడిన వెంటనే షూటింగ్ పూర్తి స్థాయిలో ప్రారంభం కానుంది. తెలుగుతో పాటు ఇతర దక్షిణాది భాషల్లోనూ పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాను విడుదల చేయాలని నిర్మాతలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

### బర్త్‌డే స్పెషల్.. శివకార్తికేయన్ 'సియోన్' నుంచి

# భాగ్యశ్రీ బోర్సే ఫస్ట్ లుక్ విడుదల

కోలీవుడ్ స్టార్ హీరో శివకార్తికేయన్ కథానాయకుడిగా నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'సియోన్' (ావఎశీఅ) నుంచి తాజాగా అదిరిపోయే అప్‌డేట్ వచ్చింది. ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తున్న భాగ్యశ్రీ బోర్సే పుట్టినరోజును పురస్కరించుకుని, చిత్ర బృందం ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ స్పెషల్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో భాగ్యశ్రీ అచ్చమైన గ్రామీణ యువతిగా, నీలి రంగు చుడిదార్ ధరించి, నుదుట కుంకుమ మరియు జడలో మల్లెపూలతో ఎంతో సహజంగా కనిపిస్తోంది. ముఖ్యంగా ఆమె చేతిలో నెమలి ఈక పట్టుకుని సీరియస్ లుక్‌తో ఎవరినో హెచ్చరిస్తున్నట్లుగా ఉన్న హావభావాలు సినిమాపై ఆసక్తిని పెంచుతున్నాయి. గాజుల దుకాణం నేపథ్యంలో ఉన్న ఈ లుక్ చూస్తుంటే ఇది పక్కా విలేజ్ బ్యాక్‌డ్రాప్ మాస్ ఎంటర్‌టైనర్ అని స్పష్టమవుతోంది. లెజెండరీ నటుడు కమల్ హాసన్ తన సొంత బ్యానర్ రాజ్ కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్‌పై ఆర్. మహేంద్రన్‌తో కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రానికి శివకుమార్ మురుగేశన్ దర్శకత్వం వహిస్తున్నారు. స్టార్ కంపోజర్ సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం శివకార్తికేయన్ కెరీర్‌లో మరో విభిన్నమైన ప్రయత్నంగా నిలవనుంది. తెలుగులో 'మిస్టర్ బచ్చన్' సినిమాతో గుర్తింపు పొందిన భాగ్యశ్రీ బోర్సేకు ఇది కోలీవుడ్‌లో భారీ ప్రాజెక్ట్ కాగా, ఈ చిత్రం 2026 అక్టోబర్‌లో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది.





# జోస్యం ఫలించింది!

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో దళపతి విజయ్ స్థాపించిన టీవీకే పార్టీ సరికొత్త చరిత్ర సృష్టించిన విషయం తెలిసిందే. అందరి అంచనాల్ని తలక్రిందులు చేస్తూ అతిపెద్ద పార్టీగా అవతరించడంతో సినీ ప్రముఖుల నుంచి దళపతి విజయ్‌కి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో అగ్ర కథానాయిక పూజాహెగ్డే ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఓ వీడియో వైరల్‌గా మారింది. త్వరలో విడుదల కాబోతున్న విజయ్ 'జన నాయగన్' చిత్రంలో పూజాహెగ్డే కథానాయికగా నటించిన విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ టైమ్‌లో తీసుకున్న ఓ సరదా వీడియోను పూజాహెగ్డే ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకుంది.

ఇందులో ఆమె ఓ వైట్ బోర్డ్ మీద 'వచ్చే ఎన్నికల్లో ఎవరు గెలుస్తారు?' అనే క్యాప్షన్‌ను రాసి దానిని పక్కనే ఉన్న విజయ్‌కి చూపిస్తూ సరదాగా కనిపిస్తున్నది. ఈ వీడియోను షేర్ చేసిన పూజాహెగ్డే 'నేను ఈ విజయాన్ని ముందే ఊహించాను. కలలు నిజం కావడం చాలా ఆనందంగా ఉంది విజయ్ సార్' అంటూ వ్యాఖ్యానించింది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. పూజాహెగ్డే జోస్యం ఫలించిందంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.

# కౌన్సిలర్ స్పందించిన తీరుపై ప్రజల్లో హర్షం

**- అకాల వర్షంతో ప్రజల ఇబ్బందులపై స్పందించిన కౌన్సిలర్ పెంటరి రాజు**





మంథని ( ప్రశ్న న్యూస్) మంథనిలో కురిసిన అకాల వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ముఖ్యంగా 10వ వార్డు పరిధిలోని తమ్మిచెరువు కట్ట వీది, పద్మశాలివాడ, అపార్ట్మెంట్ ప్రాంతంలోని రోడ్లన్నీ నీటితో నిండిపోయాయి. నాలాల్లో పేరుకుపోయిన చెత్తను వార్డ్ కౌన్సిలర్ పెంటరి రాజు స్వయంగా ఒక్కరే తొలగించి నీరు సులభంగా పోయేందుకు మార్గం సుగమం చేశారు. సుమారు రెండు గంటలకు పైగా భారీ వర్షం పడడంతో ఈ దుస్థితి ఏర్పడింది. ఈ దుస్థితిని గ్రహించిన రాజు రాత్రి సమయంలో ఒక్కడే రంగంలోకి దిగి ప్రజల ఇబ్బందులపై స్పందించిన తీరు పట్ల అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం రాత్రి రాజు ఒక్కడే శ్రమించి బుధవారం మున్సిపల్ సిబ్బందితో దగ్గర ఉండి మరి నాలాలను శుభ్రం చేయించారు.

# ఎస్‌సీ కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూలు పూర్తి

**- 118 దరఖాస్తుల్లో 89 మంది అభ్యర్థుల హాజరు**

**- బోయినిపల్లి ఎంపీడీఓ : భీమా జయశీల**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) ఎస్‌సీ కార్పొరేషన్ ఆక్షన్ ప్లాన్ 2025-26 సంవత్సరానికి సంబంధించి వ్యక్తిగత రుణాల మంజూరీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు బుధవారం బోయినిపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఎంపీడీఓ బి. జయశీల ఒక ప్రకటనలో తెలిపారు.మొత్తం 118 మంది దరఖాస్తు చేసుకోగా, అందులో 89 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరైనట్లు పేర్కొన్నారు. మండల స్పెషల్ ఆఫీసర్ ఆర్. శరత్ బాబు ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు ఈ ఇంటర్వ్యూలు నిర్వహించబడినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత బ్యాంకుల మేనేజర్లు, ఏఓ కె. ప్రణీత, వెటర్నరీ డాక్టర్ ఎస్. శ్రీధర్, ఏపీఎం జి. పవన్‌కుమార్ తదితరులు,కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. అర్హులైన లబ్ధిదారులకు నిబంధనల ప్రకారం రుణాలు మంజూరు చేసే ప్రక్రియ కొనసాగుతుందని ఎంపీడీఓ తెలిపారు.

# ధాన్యం తరలింపులో జాప్యం లేకుండా చూడాలి

**- జిల్లా కలెక్టర్ : గరిమ అగ్రవాల్**



వేములవాడ / బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని కొదురుపాక,వేములవాడ అర్బన్ మండలం, అనుపురం ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ బుధవారం పరిశీలించారు. ధాన్యం తూకానికి అనుగుణంగా లారీల సంఖ్య పెంచాలని, రైతులకు అవసరమైన వసతులు కల్పించాలని అధికారులకు ఆదేశించారు. అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.అనంతరం బోయినిపల్లి మండలం, జగ్గారావుపల్లిలోని సుహాస్ రైస్ మిల్లును తనిఖీ చేసిన కలెక్టర్, హమాలీల సంఖ్య పెంచి ధాన్యాన్ని వేగంగా అన్‌లోడింగ్ చేయాలని మిల్లర్లకు సూచించారు. రైతుల ఖాతాల్లో డబ్బులు త్వరగా జమయ్యేలా చర్యలు తీసుకోవాలని పౌర సరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఎల్. బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ, జిల్లా సహకార అధికారి రామకృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్ షరీఫ్ మోహినుద్దీన్,తదితరులు పాల్గొన్నారు.

## మోదీ సభ - హిందూ యాత్ర విజయానికి

# బీజేపీ సమన్వయ సమావేశం

**- ప్రజా సభలు విజయవంతం చేయడం ప్రతి కార్యకర్త బాధ్యత**

**- భాజపా మండలాధ్యక్షులు : ఎడపల్లి పరశురాం**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ మే 10న హైదరాబాద్‌లో నిర్వహించనున్న భారీ ప్రజాసభ, అలాగే మే 12న కరీంనగర్‌లో జరగనున్న హిందూ ఏకతా యాత్రను విజయవంతం చేయాలనే లక్ష్యంతో భారతీయ జనతా పార్టీ బోయినిపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు ఎడపల్లి పరుశురామ్ అధ్యక్షతన సమన్వయ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా బీజేపీ కోశాధికారి వైద్య రామానుజన్ హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రధాని మోడీ సభ దేశాభివృద్ధికి చారిత్రాత్మకమని, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ నాయకత్వంలో జరిగే హిందూ ఏకతా యాత్ర సమాజ ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజలను భారీగా తరలించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శులు రాజేంద్రప్రసాద్, మెరుపుల గంగాధర్ గౌడ్, ఉపాధ్యక్షుడు ఇల్లందుల బాలయ్య, కార్యదర్శి పెంచల మహేష్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, యువమోర్చా అధ్యక్షుడు శరత్ చంద్రారెడ్డి, నాయకులు జనగాం లక్ష్మణ్, కనుకటి హరీష్,స్వామి కుమార్,నాగరాజు,ఆవుల లక్ష్మణ్,సాయికుమార్, నిఖిల్, భాస్కర్ రెడ్డి,చంద్రయ్య,కట్ట విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేద ప్రజలకు

# అందేలా చూడాలని అధికారలను ఆదేశించారు.

**- మంథని ఆర్ఆర్ గార్డెన్, గంగాపురి లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ .**

**- కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన మంత్రి శ్రీధర్ బాబు.**

**- అంగన్వాడి టీచర్లకు సెల్ ఫోన్లు అందజేసిన .శ్రీధర్ బాబు. - ఎంపీ గడ్డం వంశీకృష్ణ**





మంథని( ప్రశ్న న్యూస్) తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా మంథని ఆర్ఆర్ గార్డెన్‌లో నియోజకవర్గ స్థాయి కార్యక్రమం జోరుగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ హాజరయ్యారు.కాటారం, మహాముత్తారం, మహాదేవపూర్, మలహర్రావు, పలిమెల మండలాలకు చెందిన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులు చేతుల మీదుగా అందజేశారు. అంగన్‌వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్లు ఇచ్చి ప్రభుత్వ సేవలు ఇంకా వేగంగా అందేలా చూడాలని సూచించారు.
ఈ సందర్భంగా మంత్రి, ఎంపీ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నిజమైన అర్హుల దగ్గరకు చేరాలంటే అధికారులు కట్టుదిట్టంగా పని చేయాలని చెప్పారు. గ్రామాల్లో ప్రజలకు నేరుగా లాభం చేకూరేలా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. మహిళల సంక్షేమం, పేద కుటుంబాల ఆర్థిక భద్రత, పిల్లల పోషణ విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెడుతోందని వివరించారు.అకాల వర్షాల కారణంగా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రస్తావించిన ఎంపీ గడ్డం వంశీకృష్ణ, తడిసిన ప్రతి వరి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్‌కు స్పష్టంగా సూచించారు. ఒక్క రైతు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, చివరి గింజ వరకు రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని భరోసా ఇచ్చారు.ప్రజలు, లబ్ధిదారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రైతుల సేవకు పున:రంకితమవుతా...

**ప్రభుత్వ ఆదేశాల మేరకు బాధ్యతలు స్వీకరించిన పిఎసి చైర్మన్, పాలకవర్గశీ**

**మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్**





మంథని (ప్రశ్న న్యూస్) ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పదవి అవకాశం ఉన్నంత వరకు రైతుల సేవకు పున:రంకితం అవుతానని మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు. బుధవారం సింగిల్ విండో కార్యాలయంలో చైర్మన్ కొత్త శ్రీనివాస్ డైరెక్టర్లతో కలిసి పర్సన్ ఇంచార్జిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సంఘ పర్సన్ ఇంచార్జి కొత్త శ్రీనివాస్ మాట్లాడుతూ మళ్లీ వచ్చిన పదవి అవకాశంతో రైతుల సేవే పరమావధిగా పని చేస్తామని స్పష్టం చేశారు. అయితే గతంలోనే సింగిల్ విండో పాలకవర్గాల గడువు తేది14.02.2025తో ముగిసి పోయిన అనంతరం 24.02.2025 న రాష్ట్ర ప్రభుత్వం పాలకవర్గాల గడువును 6 నెలలు పొడిగించిందని అన్నారు. మొదటిసారి ఇచ్చిన గడువు ముగియడంతో తిరిగి 03.09.2025న మరో 6 నెలలు గడువును పొడిగిస్తూ 2వ సారి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, ఆ గడువు ముగియకముందే అర్థాంతరంగా పాలకవర్గాలను 19.12.2025 రద్దు చేసిందని అన్నారు. పాలకవర్గాల పొడిగింపుపై హైకోర్టులో దావా వేయగా, పాలకవర్గాలను తిరిగి యథావిధిగా కొనసాగించాలని ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు తాము పర్సన్ ఇన్ చార్జీలుగా బాధ్యతలు స్వీకరించాలని రాష్ట్ర ప్రభుత్వం, సహకార శాఖ కమిషనర్, జిల్లా సహకార అధికారి ఉత్తర్వులు జారీ చేశారన్నారు.. ఈ మేరకు సింగిల్ విండో కార్యాలయంలో సంఘ మానిటరింగ్ అధికారి కె.అనిల్ కుమార్, సంఘ కార్యదర్శి మామిడాల అశోక్ కుమార్ సమక్షంలో పర్సన్ ఇన్ చార్జిగా కొత్త శ్రీనివాస్, డైరెక్టర్లు బాధ్యతలు స్వీకరించారు. పర్సన్ ఇన్చార్జిగా బాధ్యతలు చేపట్టడం ఆనందదాయకంగా ఉందని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, డైరెక్టర్లు అన్నారు. ఐటి, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీను బాబు నాయకత్వంలో సహకార సంఘ అభివృద్దికి, రైతుల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులు బెల్లంకొండ ప్రకాష్ రెడ్డి, డైరెక్టర్లు ఆకుల రాజబాపు,పెద్దిరాజు ప్రభాకర్, రావికంటి సతీష్ కుమార్,సిరిముర్తి ఓదెలు,లెక్కల కిషన్ రెడ్డి, కొత్త శ్రీనివాస్, దాసరి లక్ష్మి, ఉడుత మాధవి, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

## పోక్సో కేసులో నిందితుడికి

# 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

**బాధితురాలికి రూ.2 లక్షల విక్టిమ్ కంపెన్సేషన్ మంజూరు**

**మెదక్ జిల్లా ఎస్పీ డి. వి. శ్రీనివాస రావు**




మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) మెదక్ జిల్లా తూప్రాన్ మండలంలో 2019 లో మతిస్థిమితం లేని మైనర్ బాలికపై జరిగిన అమానుష లైంగిక దాడి కేసులో ప్రత్యేక పోక్సో కోర్టు వెలువరించిన తీర్పు సమాజానికి గట్టి హెచ్చరికగా నిలిచిందని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, తెలిపారు. నిందితుడు అర్కెల నాగేశ్‌కు 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.2,000 జరిమానా విధించడంతో పాటు, బాధితురాలి మానసిక వేదన, పునరావాసం దృష్ట్యా రూ.2,00,000 విక్టిమ్ కంపెన్సేషన్ మంజూరు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ ఘటనలో మైనర్ బాలికపై జరిగిన దారుణం అత్యంత విషాదకరమని, ఆమె మతిస్థిమితం సరిగ్గా లేకపోవడంతో గర్భవతి అయినా విషయాన్ని కూడా గుర్తించలేకపోవడం సమాజాన్ని కలచివేస్తుందని ఎస్పీ అన్నారు. ఆరు నెలల తర్వాత విషయం వెలుగులోకి రావడంతో కేసు నమోదు చేసి, పోక్సో చట్టం కింద కఠిన చర్యలు తీసుకున్నామని వివరించారు. ప్రస్తుతం బాధితురాలికి 7 సంవత్సరాల వయస్సు గల కుమారుడు ఉన్నాడని తెలిపారు. దాదాపు ఆరు సంవత్సరాల పాటు సాగిన ఈ కేసులో ప్రజా అభియోగాధికారి బాలయ్య సమర్థంగా వాదనలు వినిపించడం, భరోసా కేంద్రం లీగల్ అడ్వైజర్ అడ్వకేట్ స్వేత బాధితురాలికి మానసిక ధైర్యం నింపి, ఆమె సాక్ష్యం చెప్పడనికి సిద్ధం చేసి కేసు విజయంలో కీలకమయ్యాయని అన్నారు. కేసు నమోదు చేసిన ఎస్ఐ కె.సుభాష్ , దర్యాప్తు అధికారి డీఎస్పీ కిరణ్, లైజనింగ్ అధికారులు ఎసై విఠల్, కృష్ణ, కోర్టు సీడీఓ నాగరాజు అందరి కృషి అభినందనీయమని ఎస్పీ తెలిపారు. చిన్నారులపై లైంగిక నేరాలను అరికట్టడంలో పోక్సో చట్టం అత్యంత కఠినమైందని, ఇటువంటి నేరాలకు పాల్పడేవారికి తప్పనిసరిగా కఠిన శిక్షలు పడతాయని హెచ్చరించారు. ప్రతి కుటుంబం, ప్రతి వ్యక్తి పిల్లల భద్రతపై అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. న్యాయం ఆలస్యమైనా తప్పక జరుగుతుందనే సందేశాన్ని ఈ తీర్పు స్పష్టంగా ఇస్తోందని ఎస్పీ పేర్కొన్నారు. బాధితురాలి ధైర్యం, అధికారుల నిబద్ధత, న్యాయవ్యవస్థ కట్టుదిట్టమైన చర్యలు కలిసొచ్చినప్పుడు నేరాలకు తావుండదని అన్నారు. చిన్నారి భవిష్యత్తు కాపాడటం మనందరి బాధ్యత అని పునరుద్ఘాటించారు.

# బాలల హక్కులను కాలరాస్తే ఉపేక్షించం

**రాష్ట్రబాలల హక్కుల పరిరక్షణ కమిషనర్ చైర్ పర్సన్ సీతా దయాకర్ రెడ్డి**



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) బుధవారం కలెక్టరేట్లోని మీటింగ్ హాల్లో ఉమ్మడి మెదక్ జిల్లా శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.మెదక్ ,సిద్దిపేట,సంగారెడ్డి జిల్లాలో బాలకార్మిక వ్యవస్త, బాల్య వివాహాలు,డ్రగ్స్ నియంత్రణ,కిషోర బాలికల ఆరోగ్య అవగాహన ,విద్య అవగాహన, పాఠశాలల్లో డ్రాప్ ఔట్ తగ్గించడం, పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణాలు, హాస్టల్లో ఫుడ్ పాయిజన్ సంఘటనలు, సాధారణ ప్రసవాలు, పోక్సో కేసుల నమోదు వివరాలు, అతి ప్రమాద మైనర్ డ్రైవింగ్ అనే అంశాలపై ఉమ్మడి జిల్లా అధికారులనుంచి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా రాష్ట్రబాలల హక్కుల పరిరక్షణ కమిషనర్ చైర్ పర్సన్ సీతా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ ..బాలలు సురక్షితంగా, ఆరోగ్యంగా, గౌరవప్రదంగా ఎదగడానికి అవసరమైన అన్ని హక్కులను కాపాడటం ప్రభుత్వంతో పాటు సమాజం మొత్తం బాధ్యత అని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ చైర్పర్సన్ స్పష్టం చేశారు.
బాలల హక్కుల ఉల్లంఘన ఎక్కడ జరిగినా, ఎలాంటి ఒత్తిడులు ఉన్నా కూడా కమిటీ కఠిన చర్యలు తీసుకుంటుందని ఆమె గట్టిగా హెచ్చరించారు.చిన్నారులు మన సమాజానికి భవిష్యత్తు బలమైన స్థంభాలు. వారి శారీరక, మానసిక, భావోద్వేగ వికాసానికి అనుకూల వాతావరణం కల్పించడం అత్యవసరం. అయితే ఇటీవల కొంతమంది బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తూ బాలలపై దౌర్జన్యాలు, బాల కార్మికత్వం, బాల్య వివాహాలు, విద్యా హక్కుల నిర్లక్ష్యం వంటి ఘటనలు చోటు చేసుకోవడం ఆందోళనకరం అన్నారు.జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..జిల్లాలో బాలల రక్షణ యంత్రాంగాన్ని మరింత సమర్థవంతంగా పనిచేసేలా సూచనలు జారీ చేసినట్లు తెలిపారు. పాఠశాలలు, హాస్టళ్లు, బాలల సంరక్షణ గృహాలు, అనాథాశ్రమాలు వంటి ప్రదేశాల్లో అకస్మాత్తుగా తనిఖీలు నిర్వహిస్తూ, చిన్నారుల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నామని వెల్లడించారు.తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంలోని ప్రతీ ఒక్కరూ బాలల హక్కుల పరిరక్షణలో కీలక పాత్ర పోషించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యులు వందనా గౌడ్, చందన, సరిత, అపర్ణ, అగర్వాల్, వచన్ కుమార్ సిద్దిపేట డిఆర్ఓ నాగరాజమ్మ , మెదక్ అడిషనల్ ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ సిద్దిపేట అడిషనల్ ఎస్పీ ఉమ్మడి జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# తుర్కయంజాల్ లో కల్తీ పెరుగు దందా.?

## పత్తాలేని ఫుడ్ ఇన్స్పెక్టర్లు, మున్సిపల్ అధికారులు

- అత్యంత అపరిశుభ్ర వాతావరణంలో డెయిరీ నిర్వహణ
- విచ్చలవిడిగా ట్రేడ్ లైసెన్, ఎఫ్ ఎస్ ఎస్ ఎస్ ఏ ఐ సర్టిఫికెట్లు జారీ
- పాలు,పెరుగు నమూనాలు అధికారులు పరీక్షించేది లేదు చర్యలు ఉండవు
- ఫుడ్ సేఫ్టీ అధికారులకు ప్రతినెల మామూళ్లు ఇస్తున్న అక్రమ వ్యాపారులు.?
- ఫుడ్ సేఫ్టీ అధికారులు డ్యూటీ చేయడం మానేశారా.? ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారా.?
- కల్తీ ఆహార పదార్థాలను కట్టడి చేయడంలో పూర్తిగా విఫలమవుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం






హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తుర్కయంజాల్ ప్రాంతంలో కల్తీ పాల ఉత్పత్తుల వ్యాపారం రోజురోజుకూ పెరుగుతున్నదన్న ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా ఆదిభట్ల సర్కిల్ పరిధిలో తుర్కయంజాల్, కమ్మగూడ లోని "శ్రీ సాయి డైరీ" పేరుతో నడుస్తున్న ఒక డైరీ యూనిట్‌లో కల్తీ పెరుగు విక్రయాలు జరుగుతున్నాయంటూ స్థానికులు గట్టిగా విమర్శిస్తున్నారు. ఆరోగ్యానికి అత్యంత కీలకమైన పాలు, పెరుగు వంటి ఆహార పదార్థాలు కల్తీ అవుతుండటంతో ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడిందనే భయం నెలకొంది. స్థానికుల మాటల్లో చెప్పాలంటే, ఈ డైరీలో తయారయ్యే పెరుగులో నాణ్యతకు ఎలాంటి హామీ లేదని, కాస్టిక్ సోడాతో తయారు చేస్తున్నట్లు అనుమానాలు వ్యక్తం చేశారు. పాలు కూడా కల్తీగా ఉండే అవకాశం ఉందని అంటున్నారు. నీళ్లు కలిపి, రసాయనాలు ఉపయోగించి తయారు చేసిన పెరుగు మార్కెట్‌లో అమ్ముతున్నారని ఆరోపిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలు ఏది తినాలో, ఏది నమ్మాలో తెలియని అయోమయంలో పడుతున్నారు. ఇదే సమయంలో ఫుడ్ సేఫ్టీ అధికారుల నిర్లక్ష్యంపై కూడా తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్థానికులు పలుమార్లు ఫిర్యాదులు చేసినా, సంబంధిత అధికారులు సరైన చర్యలు తీసుకోవడం లేదని దీని వెనక లంచాలే కారణమని ఆరోపిస్తున్నారు. తనిఖీలు సక్రమంగా జరగడం లేదని, అక్రమ వ్యాపారాలపై కఠిన చర్యలు లేకపోవడం వల్ల గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కల్తీ దందా మరింత విస్తరిస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఈ కల్తీ వ్యాపారులు అధికారులకు ప్రతినెల 'మామూళ్లు' ఇస్తామని బహిరంగంగా సవాలు విసురుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇది నిజమైతే, అధికారులు కూడా ఈ దందాలో భాగస్వాములయ్యారని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



### అధికారుల కనుసైగల్లోనే కల్తీ దందా.?

హైదరాబాద్లో జరుగుతున్న ఆహార కల్తీ వ్యాపారంలో ప్రతి అధికారి లేదా సిబ్బంది హస్తం ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి వాళ్లకు తెలిసి వాళ్ళకలు సైగల్లోనే వాళ్ళు లంచాలు తీసుకొని ఈ తందాను పరోక్షంగా కొనసాగిస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నత అధికారుల దృష్టికి వెళితే తప్ప దాడులు జరగని దుస్థితి నెలకొన్నది దానితో ప్రజల ఆరోగ్యం గాలిలో దీపంగా మారిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాలు పెరుగు చిన్న పిల్లలు ఉపయోగిస్తారు కాబట్టి వాళ్ల పరిస్థితి ఏమవుతుందని వాళ్లకు చిన్నతనంలోనే అంతుచిక్కని వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని తల్లిదండ్రుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడ చూసినా అక్రమ దందాలు కచ్చితంగా అధికారుల కనుసైగల్లోనే ఈ అక్రమాలు సాగుతున్నాయా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ కల్తీ దందాలకు కూడా అధికారులు ట్రేడ్ లైసెన్లను, ఎఫ్ ఎస్ ఎస్ ఏ ఐ సర్టిఫికెట్లను జారీ చేయడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. వీటిని కళ్ళు మూసుకొని జారీ చేస్తున్నారా లేక లంచాలు తీసుకొని జారీ చేస్తున్నారా అన్నది కమిషనర్కే తెలియాలి. ఒక సర్టిఫికెట్ ప్రభుత్వం జారీ చేయాలంటే దానిపై వాస్తవాలను పరిశీలించాలన్న కనీస అవగాహన కూడా అధికారులకు లేకపోవడం ప్రజల దౌర్భాగ్యంగా భావిస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ నగరంలో ప్రస్తుతం పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. మార్కెట్‌లో దొరికే పండ్లు, పాలు, పెరుగు ఏది కొనాలన్నా ప్రజలు భయపడే పరిస్థితి నెలకొన్నది. అసలు పదార్థం ఏది, నకిలీ ఏది అన్నది గుర్తించడం కష్టంగా మారింది. కల్తీ ఆహారం వాడకం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు పెరిగే ప్రమాదం ఉన్నప్పటికీ, దీనిపై ప్రభుత్వానికి తగిన నియంత్రణ లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వం ఫుడ్ సేఫ్టీ విషయంలో పూర్తి నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని ప్రజలు మండిపడుతున్నారు. కల్తీ ఆహారంపై కఠిన చర్యలు తీసుకోవాలని, అక్రమంగా పనిచేస్తున్న డైరీలు, ఫుడ్ యూనిట్లపై దాడులు జరిపి నిజాలను బయటపెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యం కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని గుర్తుచేస్తున్నారు.

### కల్తీపై నిత్యం హెచ్చరిస్తున్న వైద్యులు..

కల్తీ పాలు, పెరుగు, పండ్లు ఇతర ఆహార పదార్థాల వాడకం వల్ల జీర్ణకోశ సమస్యలు, అలర్జీలు, అల్సర్లు, ఫుడ్ ఇన్ఫెక్షన్, ఇంకా



తీవ్రమైన క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే అవకాశముందని. చిన్న పిల్లలు, వృద్ధులు ఎక్కువగా ప్రభావితమవుతారని చెబుతున్నారు. అందుకే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నమ్మకమైన వారి నుంచి మాత్రమే ఆహార పదార్థాలు కొనాలని సూచిస్తున్నారు. లేనిపక్షంలో కల్తీ ఆహార పదార్థాలు ఆరోగ్యాన్ని నాశనం చేసే అవకాశం ఉందని ప్రభుత్వ అధికారులు కూడా దీనిపై పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి తుర్కయంజాల్‌లో కల్తీ పెరుగు, పాల వ్యవహారం కేవలం ఒక ప్రాంత సమస్యగా కాకుండా, మొత్తం గ్రేటర్ హైదరాబాద్ నగరానికి హెచ్చరికగా మారింది. ఇప్పటికైనా ఫుడ్ సేఫ్టీ అధికారులు కళ్లెదుట జరుగుతున్న ఈ కల్తీ దందాలపై కఠిన చర్యలు తీసుకుని, ప్రజలకు నాణ్యమైన ఆహారం అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. లేదంటే "ప్రజల ఆరోగ్యం గాలిలో దీపం" అన్న మాట నిజమవుతుందనే భయం మరింత పెరుగుతోంది. మరి దీనిపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.

# శుభ్రం అవుతున్న మురికి కాలువ

- మురికి కాలువ సమస్యపై స్పందించిన అధికారులు
- పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని స్థానిక ప్రజల విన్నపం
- 'ప్రజాప్రశ్న" దినపత్రిక కథనంతో సమస్య తీరడం పై స్థానికుల అభినందన






గజ్వేల్ (ప్రశ్న న్యూస్) గజ్వేల్ పట్టణంలో నెలలుగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న మురికి కాలువ సమస్యపై చివరికి అధికారులు కదిలారు. సమస్యను పట్టించుకోని నిర్లక్ష్యానికి పరాకాష్టగా మారిన ఈ అంశం పై "ప్రజాప్రశ్న" దిన పత్రికలో వెలుగులోకి రాగానే అధికార యంత్రాంగం ఒక్కసారిగా మేల్కొన్న తీరు చర్చనీయాంశంగా మారింది. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని ప్రజ్ఞాపూర్ నుండి గజ్వేల్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై, సిరి ఎంక్లేవ్ సమీపంలో శ్రీజ బైక్ పాయింట్ వద్ద ఉన్న మురికి కాలువ పూర్తిగా పూడుకుపోయి, అత్యంత దుర్వాసనతో ప్రజల జీవనాన్ని నరకంగా మార్చింది. వర్షాలు పడితే పరిస్థితి మరింత దారుణంగా మారి, రోడ్లపైకి కాలుష్య మురికి నీరు పొంగిపొర్లుతూ వ్యాధులకు కేంద్రంగా మారింది. అయినప్పటికీ మున్సిపల్ అధికారులు కళ్లుచూపకుండా ఉండటంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.





ప్రజాప్రశ్న
తెలుగు దినపత్రిక
మురికి కాలువ సమస్య తీర్చలేరా.?
గజ్వేల్ రహదారి పైనే ఇంత అధ్వాన దుస్థితి
వార్డు కౌన్సిలర్ అధికారులు సమస్యలు గాలికి వదిలేసారా.?
దుకాణదారుల ఆవేదన పట్టేది ఎవరికి.?
రోజు రోజుకి దిగజారి పోతున్న గజ్వేల్ మున్సిపల్ అధికారుల పనితీరు
13 Apr 2026 | Prajaprashna | Page 8
Source: https://epaper.prajaprashna.com/

ఈ సమస్యపై ప్రజాప్రశ్న దిన పత్రిక ఘాటైన కథనాన్ని ప్రచురించడంతో పరిస్థితి మారింది. వార్త వెలువడిన కొద్ది రోజులలో మున్సిపల్ అధికారులు యంత్రాంగంతో అక్కడికి చేరుకుని శుభ్రత పనులు చేపట్టడం గమనార్హం. కాలువలో పేరుకుపోయిన మురికిని తొలగించి, నీటి ప్రవాహాన్ని సవ్యంగా కొనసాగించేలా చర్యలు తీసుకున్నారు. ఈ పరిణామం ఒకవైపు అధికారుల స్పందనను చూపుతుండగా, మరోవైపు ముందుగా చర్యలు తీసుకోకపోవడం వారి నిర్లక్ష్యాన్ని బహిర్గతం చేస్తోంది. సమస్య తీవ్రత పెరిగే వరకు వేచి చూడడం ఎందుకు.? ప్రజలు ఇబ్బందులు పడిన తర్వాతే స్పందించాల్సిన పరిస్థితి ఎందుకు వస్తుంది.? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. స్థానిక వ్యాపారులు, నివాసితులు మాత్రం సమస్య పరిష్కారంపై సంతోషం వ్యక్తం చేస్తూ, తమ బాధను వెలుగులోకి తీసుకువచ్చిన "ప్రజాప్రశ్న" దిన పత్రికకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఆలస్యమైనా సరే చర్యలు తీసుకున్న మున్సిపల్ అధికారులను అభినందించారు. అయితే ఇది తాత్కాలిక పరిష్కారంగా మిగలకుండా పట్టణంలో ఉన్న అన్ని మురికి కాలువలను పర్యవేక్షిస్తూ శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. లేనిపక్షంలో ఇదే సమస్య మళ్లీ పునరావృతమవుతుందని హెచ్చరిస్తున్నారు. మొత్తానికి మీడియా ప్రభావం ముందు అధికార యంత్రాంగం ఎలా కదులుతుందో గజ్వేల్ ఘటన మరోసారి నిరూపించింది. ప్రజా సమస్యలపై స్థానిక జర్నలిస్టుల నిరంతర పర్యవేక్షణ, బాధ్యతాయుత స్పందన ఉంటేనే ప్రజలకు నిజమైన సేవ అందుతుంది గజ్వేల్ ప్రజలు పేర్కొంటున్నారు.

### రైతులకు వేగంగా

# విత్తన సరఫరా చేయాలి

- వ్యవసాయ, ఉద్యాన పంటల కొనుగోళ్ల అంశంపై సీఎం సమీక్ష



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఈ ఏడాది మే 15 నుంచే రైతులకు సాగునీరు అందించనున్న దృష్ట్యా రాష్ట్రంలో వేగంగా విత్తన సరఫరా చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వ్యవసాయ శాఖకు దిశానిర్దేశం చేశారు. విత్తనాల సరఫరా కోసం రూ.200 కోట్లు కేటాయించాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. సచివాలయంలో బుధవారం రాష్ట్రంలో ధాన్యం, అరటి, పొగాకు, ఆయిల్ పామ్ తదితర పంటల కొనుగోళ్లపై ముఖ్యమంత్రి వ్యవసాయ, ఉద్యాన శాఖలతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు మంత్రి కె. అచ్చెన్నాయుడు, వ్యవసాయ, ఉద్యాన శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. మార్కెట్ డిమాండ్ కు అనుగుణంగా రైతులు పండించే పంటలకు ధరలు దక్కేలా చూడాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ట్రేసబిలిటీ, సర్టిఫికేషన్ ద్వారా పంటలకు మెరుగైన ధర లభించే అవకాశం ఉంటుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రైతుకు లాభసాటిగా ఉండేలా నాణ్యమైన పంట దిగుబడులు వచ్చేందుకు కృషి చేయాలని సూచించారు.మరిన్ని పంటలను ప్రకృతి సేద్యం విధానంలో సాగు చేస్తే రైతులకు మరింత ప్రయోజనం కలుగుతుందని అన్నారు. సేంద్రీయ సాగుకు కంపోస్టు ఎరువును సరఫరా చేసేలా చూడాలన్నారు. ఈ ఏడాది 42.06 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న పంట ఉత్పత్తి వస్తుందని అధికారులు వివరించారు. మొక్క జొన్న సహా ఇతర పంటల ద్వారా ఇథనాల్ తయారీకి ఉన్న అవకాశాలను అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి సూచనలు చేశారు. మామిడిని ప్రాసెసింగ్ యూనిట్లు కొనుగోలు చేసేలా చూడాలని అన్నారు. అరటి, ఆయిల్ పామ్, మిర్చి, కోకో లాంటి పంటలకు సంబంధించి ధరల సమస్య లేదని రైతులకు మంచి ధర లభిస్తోందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. సీజన్ కంటే ముందే రాష్ట్రంలోని నీటి వనరుల్లో ఫిష్ సీడ్ ను సరఫరా చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

వచ్చే పంట సీజన్ కు 7.5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని అధికారులు తెలిపారు. నాఫెడ్ నుంచి మినుములు ఇతర వాణిజ్య పంటల్ని కొనుగోలు చేస్తున్నామని మంత్రి అచ్చెన్నాయుడు ముఖ్యమంత్రికి వివరించారు. పీఎండీఎస్ పథకం ద్వారా తక్కువ యూరియా వినియోగానికి ఇచ్చే ప్రోత్సాహకం పై కేంద్రంతో మాట్లాడాలని వారికి సూచించారు. మదనపల్లె లో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటు కానుందని ముఖ్యమంత్రి అన్నారు.

# డీఎంకే, తృణమూల్ ఓటమి ఎఫెక్ట్

- ఐ-ప్యాక్‌తో సంబంధాలు తెంచుకున్నట్లు అఖిలేష్ ప్రకటన



**లక్నో(ప్రశ్న న్యూస్)** తమిళనాడులో డీఎంకే కూటమి, పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఘోర పరాజయం చవిచూశాయి. ఈ రెండు పార్టీలకు ఐ-ప్యాక్ పనిచేసింది. అయితే ఈ ఓటమి తర్వాత రెండు రోజులకే ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ కీలక నిర్ణయం ప్రకటించారు. ఐ-ప్యాక్‌తో సంబంధాలు తెంచుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. అయితే, ఇందుకు నిధుల కొరత కారణమని ఆయన తెలిపారు. వచ్చే సంవత్సరం ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఐ-ప్యాక్‌తో గత సంవత్సరం ఒప్పందం కుదుర్చుకున్నామని అఖిలేశ్ యాదవ్ తెలిపారు. ఐ-ప్యాక్ టీమ్ తమతో కొన్ని నెలలు పని చేసిందని, కానీ నిధుల కొరత కారణంగా దానిని కొనసాగించలేకపోతున్నామని వెల్లడించారు.

బెంగాల్‌లో టీఎంసీ, తమిళనాడులో డీఎంకే ఓటమి నేపథ్యంలో ఈ ఒప్పందాన్ని రద్దు చేసుకున్నట్లు జరుగుతున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. ఐప్యాక్ ఒప్పందాన్ని ఎందుకు రద్దు చేశారని ఓ మీడియా ప్రతినిధి ప్రశ్నించారు. "మా వద్ద నిధులు లేవు. మీరు (మీడియా) మాకు నిధులు ఇస్తే మరో కంపెనీని ఎన్నికల కోసం నియమించుకుంటాం" అని అఖిలేష్ సరదాగా అన్నారు. కానీ, ఐప్యాక్ పని చేసిన రెండు పార్టీలు ఓడిపోయిన అనంతరం అఖిలేష్ యాదవ్ నుంచి ఈ ప్రకటన రావడం ప్రాధాన్యతను సంతరించుకుంది.పశ్చిమ బెంగాల్ ఎన్నికల తీరును అఖిలేష్ యాదవ్ ప్రశ్నించారు. దీనిని సుప్రీంకోర్టు వెంటనే సుమోటోగా స్వీకరించాలని కోరారు. ఓట్ల లెక్కింపు వీడియో రికార్డింగును ప్రజలకు అందుబాటులో ఉంచాలని అన్నారు. బెంగాల్‌లో చోటు చేసుకున్న పరిణామాలు వచ్చే సంవత్సరం ఎన్నికలు జరగనున్న ఉత్తరప్రదేశ్‌లో పునరావృతమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

# సహకరించకుంటే

# మళ్లీ బాంబు దాడులు మొదలవుతాయి

- ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక



న్యూయార్క్ (ప్రశ్న న్యూస్) ఒప్పందానికి ఇరాన్ సహకరిస్తే హర్మూజ్ జలసంధి తెరుచుకుని అంతా ప్రశాంతంగా ఉంటుందని, లేదంటే మళ్లీ బాంబు దాడులు మొదలవుతాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్ తమతో ఒప్పందం కుదుర్చుకుంటే ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ ముగిసిపోతుందని అన్నారు. అప్పుడు ఇరాన్ సహా అందరికీ హర్మూజ్ జలసంధి తెరుచుకుంటుందని పేర్కొన్నారు. ఇరాన్ నుంచి సహకారం లేకుంటే మునుపటి కంటే భీకరస్థాయిలో, మరింత తీవ్రతతో బాంబు దాడులు ఉంటాయని హెచ్చరించారు. యుద్ధం ముగింపు దిశగా ఒప్పందం కుదిరే అవకాశాలు ఉన్నాయని వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. యుద్ధాన్ని ముగించేందుకు, మరింత వివరణాత్మక అణు చర్చల కోసం ఫ్రేమ్ వర్క్‌ను ఏర్పాటు చేసేందుకు రెండు దేశాలు ఓ ఒప్పందానికి చేరువవుతున్నాయంటూ అమెరికా మీడియా సంస్థ ఒకటి తెలిపింది. అణు కార్యక్రమాల తాత్కాలిక నిషేధానికి ఇరాన్ ముందుకు రావడం, హర్మూజ్ జలసంధిలో ఆంక్షలు ఎత్తివేయడం, ఇరాన్‌కు చెందిన నిధుల విడుదలకు అమెరికా అంగీకరించడం వంటివి ఈ ఒప్పందంలో ఉన్నట్లు వార్తలు వచ్చాయి.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588